కోటగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో..
వీక్షించండి చానల్
NS99 CHANNEL
దగా స్థానంలో నిగా వేసే చానల్

దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక

నీలగిరి శంఖారావం

సమగ్ర సమాచార దర్శిని

తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ | సంపుటి :05 | సంచిక :194 | ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్ | మంగళవారం 24-11-2026 | పేజీలు : 4 | వెల : రూ. 3/-

రేవంత్,రాహుల్‌కు ఏటీఎంలా పనిచేస్తుండు..



కరీంనగర్:కాంగ్రెస్ పార్టీకి దేశ ప్రయోజనాల కంటే రాజకీయాలు, ఒకే కుటుంబం యొక్క అభ్యున్నతే ముఖ్యమని నితిన్ నబీన్ ఆరోపించారు. ఇవాళ కరీంనగర్‌లో నిర్వహించిన బీజేపీ మహాపాదయాత్ర సభలో ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ పాలనను ప్రశంసిస్తూనే, కాంగ్రెస్ పార్టీపై, రాహుల్ గాంధీపై, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిపై పలు విమర్శలు చేశారు.

కరీంనగర్ ప్రజలకు, శ్రేణులకు అభివాదం

కరీంనగర్ మహాపాదయాత్రకు కంటికి కనిపించినంత దూరం ప్రజలు ప్రభంజనంలా తరలివచ్చారని నితిన్ నబీన్ అన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలకు, తల్లులకు, యువతకు, పార్టీ కార్యకర్తలకు ఆయన ప్రత్యేక అభివాదం తెలిపారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావుల సమర్థవంతమైన నాయకత్వం, కార్యకర్తల కృషి వల్లే ఈ జనసందోహం సాధ్యమైందని ఆయన అభినందించారు. విపక్షాలు తమ సర్వశక్తులూ ఒడ్డినా ఒక్క రామ్‌లీలా మైదానాన్ని నింపలేకపోయాయని, కానీ బీజేపీ కార్యకర్తలు దేశవ్యాప్తంగా 200కు పైగా ప్రాంతాల్లో దానికి పదిరెట్ల జనాన్ని సమీకరించారని ఆయన అన్నారు.

చనిపోయిన వారి ఓట్లు తొలగించాలా.. వద్దా?

ఓట్ల చోరీ జరిగిందని రాహుల్ గాంధీ చేస్తున్న ఆరోపణలపై నితిన్ నబీన్ స్పందిస్తూ, ప్రజల మద్దతు, అసలైన ఓట్లు తమ పక్షానే ఉన్నాయని అన్నారు. ఎస్ఐఆర్ (SIR) ప్రక్రియను అడ్డుపెట్టుకుని ఇండీ కూటమి నేతలు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. 13 కోట్ల ఓట్ల చోరీ జరిగిందని రాహుల్ గాంధీ అంటున్నారని, అందులో 3 కోట్ల మంది మరణించిన వారి పేర్లు ఓటర్ల జాబితాలో కొనసాగాలా అని ఆయన ప్రశ్నించారు. తెలంగాణలో లక్షలాది మందితో సహా దేశవ్యాప్తంగా 6 కోట్లకు పైగా ప్రజలు వేరే ప్రాంతాలకు బదిలీ అయ్యారని, వారికి రెండు చోట్ల ఓటు హక్కు ఉండాలా అని నిలదీశారు. 2002-03 ఓటర్ల జాబితాలో ఆచూకీ లేని 3 కోట్ల మంది చొరబాటుదారుల ఓట్ల కోసమే కాంగ్రెస్, ఇండీ కూటమి నేతలు వకాల్తా పుచ్చుకుంటున్నారని ఆయన ఆరోపించారు. రాజ్యాంగాన్ని కేవలం చేతుల్లో పట్టుకుని తిరిగే వారికి భిన్నంగా, తాము రాజ్యాంగాన్ని గుండెల్లో, మనసుల్లో పెట్టుకుని పూజిస్తామని, రాజ్యాంగ సంస్థలను గౌరవిస్తామని ఆయన పేర్కొన్నారు.

కాంగ్రెస్ పాలన, రాహుల్ గాంధీపై వ్యాఖ్యలు

తమ స్వార్థం, కుటుంబం, పదవి కోసం దేశంలో ఎమర్జెన్సీ విధించి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన కాంగ్రెస్ నేతలు నేడు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం విడ్డూరమని నితిన్ నబీన్ విమర్శించారు. రాహుల్ గాంధీ దేశంలో ఉన్నప్పుడు దేశ ప్రజలను, విదేశాలకు వెళ్లినప్పుడు భారతదేశ ప్రతిష్ఠను అవమానిస్తున్నారని ఆయన అన్నారు. 2004 నుంచి 2014 వరకు అధికారంలో ఉన్న కాంగ్రెస్ యువతకు, మహిళలకు ఏం చేసిందో చెప్పాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాంలో అత్యంత బలహీన ఆర్థిక వ్యవస్థల జాబితాలో ఉన్న భారత్, నేడు ప్రధాని మోదీ నాయకత్వంలో ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని నితిన్ నబీన్ పేర్కొన్నారు.

రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు

తెలంగాణలో 36 నెలల పాలన పూర్తికాకముందే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 82 సార్లకు పైగా ఢిల్లీ దర్బార్‌కు వెళ్లి అధిష్ఠానానికి మోకరిల్లారని నితిన్ నబీన్ విమర్శించారు. రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజలకు, యువతకు కాకుండా కేవలం రాహుల్ గాంధీకి,కాంగ్రెస్ బ్యాంక్ ఖాతాలకు 'ఏటీఎం'లా పనిచేస్తున్నారని ఆయన ఆరోపించారు.తెలంగాణ పేద ప్రజల శ్రమను దోచి ఢిల్లీ బాస్‌ల ఏ టీఎంలను నింపుతున్నారని మండిపడ్డారు. గతంలో ఒక అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దించిన ప్రజలకు, అంతకంటే పెద్ద అవినీతి ప్రభుత్వం వస్తుందని అప్పుడు తెలియదని వ్యాఖ్యానించారు. యువత, రైతులు, మహిళలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన ఈ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ మొదలైందని, 2028, 2029 ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు బీజేపీని ఆశీర్వదిస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

నీళ్ల విషయంలో దొంగే దొంగ అన్నట్లుంది బీఆర్ఎస్ తీరు: భట్టి విక్రమార్క



హైదరాబాద్, నవంబర్ 23: గాంధీభవన్‌లో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ బీఏం సందీప్ కుమార్‌తో మంత్రులు వరుసగా భేటీ అవుతున్నారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జ్‌తో భేటీ అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఆర్గనైజేషన్ బలోపేతంపై ఇన్‌ఛార్జ్‌తో చర్చించామన్నారు. పార్టీలో విభేదాలు లేవని.. విబేధాలు లేనప్పుడు చర్చ ఎందుకు జరుగుతుందని ప్రశ్నించారు. నీళ్ల విషయంలో దొంగే దొంగ అన్నట్లుంది బీఆర్ఎస్ తీరు అంటూ మండిపడ్డారు.తెలంగాణ నీటి వాట కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పోరాటం చేస్తోందని భట్టి తెలిపారు. బీఆర్ఎస్ తప్పులను కప్పిపుచ్చుకునేందుకే కాంగ్రెస్‌పై ఆరోపణలు చేస్తోందని మండిపడ్డారు. కేటీఆర్ ఊహా ప్రపంచంలో బతుకుతున్నారని.. సోషల్ మీడియా లోకంలో ఉన్నారంటూ ఎద్దేవా చేశారు. 'ప్రభుత్వ వ్యవస్థలను బీఆర్ఎస్ కుప్పకూల్చింది.. దాన్ని సరిదిద్దుతుంటే మాపై ఆరోపణలా?' అంటూ ఫైర్ అయ్యారు. పేద కుటుంబాన్ని వెతికి మరీ సంక్షేమం అందిస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్‌కు అధికారం అనేది ఇక కలే అంటూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు.

షాబాద్‌లో ట్రోఫాయి ప్యాకేజింగ్ కంపెనీలో భారీ అగ్నిప్రమాదం

రంగారెడ్డి , షాబాద్ మండలం హైతాబాద్‌లోని ట్రోఫాయి ప్యాకేజింగ్ కంపెనీలో ఆదివారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. పరిశ్రమలో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడటంతో పరిసర ప్రాంతమంతా దట్టమైన పొగ అలుముకుంది. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేస్తున్నారు. ప్రమాదంలో పలువురు గాయపడినట్లు సమాచారం,

రేవంత్ రెడ్డి ప్రభుత్వంలోనే దళితుల పట్ల చులకన భావం



హైదరాబాద్, సీఎం రేవంత్ రెడ్డి దళితుల పట్ల వ్యవహరిస్తున్న తీరుపై కాంగ్రెస్ దళిత నాయకుడు మోత్కుపల్లి నర్సింహులు మండిపడ్డారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నా 45 ఏళ్ల రాజకీయ జీవితంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చూసిన.. తెలుగు దేశం ప్రభుత్వంలోనే ఉన్నప్పుడు కూడా చూసి.. మొన్న బీఆర్ ఎస్ గవర్నమెంట్‌ను కూడా చూశా.. ఏదేమైనా ఇంత లెక్కలేని తనం, చులకన భావంతో దళితులను చూసిన సందర్భం రేవంత్ రెడ్డి ప్రభుత్వంలోనే కనబడుతుంది..ఇది చాలా దురదృష్టకరం.. దీన్ని నేను తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు.అసలు ఏదైనా సంఘటన జరిగితే దానిమీద రివ్యూ చేసేది లేదు.. మాట్లాడేది లేదు.. దానికి సంబంధించిన నాయకులను పిలిచేది లేదు.. ఎవరినీ ఖాతరు చేయకుండా మాకిష్టమొచ్చినట్టు మేం బతుకుతమన్నట్టుగా ఈ సర్కార్ ముందుకు పోతున్నది.. దీన్ని మేం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అయ్యా.. నాయనా, రేవంత్‌రెడ్డి కేవలం ఈ నెలలో చూద్దాం.. గత మూడేళ్లది చూస్తే చాలా ఉంది.. ఈ నెల, రెండు నెలల్లో చూస్తే.. మొన్న పెద్దపల్లిలో అక్షితారాణి.. కష్టపడి బీటెక్ చదువుకున్న పేద అమ్మాయిని లైంగిక దాడి చేసి చంపారు.. నేరస్థులకు ఏం శిక్ష వేస్తరో ఏం జరుగుతుందో ఎవరు చెప్పిన దాఖలాలు లేవు.. ముఖ్యమంత్రి అసలేం మాట్లాడటం లేదు.. అంటరానివాళ్ల గురించి నా నోటి నుంచి మాట్లాడను అన్నట్టుగా రేవంత్ రెడ్డి ఉన్నడు.. ఇది చాలా దురదృష్టకరం.. బాధాకరం.. అక్కడి నుంచి వస్తే చింతపల్లిలో ఈ అమ్మాయిని 'మాదిగ ల..' అని వాడు కొట్టాడు.. కొట్టిన దాని మీద ప్రభుత్వం ఏ రకమైన చర్యలు తీసుకున్నదని మోత్కుపల్లి నర్సింహులు ప్రశ్నించారు.

'సరయూ-కమల ఎక్స్‌ప్రెస్'కు మోదీ,నేపాల్ ప్రధాని పచ్చజెండా

ఢిల్లీ / అయోధ్య, నవంబర్ 23: భారత్-నేపాల్ మధ్య రైల్వే అనుసంధానాన్ని, సాంస్కృతిక బంధాన్ని మరింత బలోపేతం చేసే దిశగా మరో చారిత్రక అడుగు పడింది. శ్రీరాముడి జన్మస్థలమైన ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య, సీతాదేవి జన్మస్థలమైన నేపాల్‌లోని జనక్‌పూర్ ధామ్ లను నేరుగా అనుసంధానించే కొత్త వీక్లీ రైలు 'సరయూ-కమల ఎక్స్‌ప్రెస్' ను ఇవాళ (నవంబర్ 23) భారత ప్రధాని నరేంద్ర మోదీ, నేపాల్ ప్రధాని బాలేంద్ర షా ఢిల్లీ నుంచి వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. అయోధ్యలో జరిగే ఈ కార్యక్రమంలో కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ పాల్గొంటారు. అయోధ్య కంటోన్మెంట్ నుంచి జనక్‌పూర్ ధామ్ వరకు సుమారు 604 కిలోమీటర్ల దూరాన్ని ఈ రైలు దాదాపు 19 గంటల్లో చేరుకుంటుంది. ప్రయాణికులు మధ్యలో రైలు మారాల్సిన అవసరం లేకుండా నేరుగా గమ్యస్థానానికి చేరుకోవచ్చు. సోమవారం ఇనాగరేషన్ రన్ జరగనుండగా, నవంబర్ 28 నుంచి సాధారణ ప్రయాణికులకు పూర్తిస్థాయిలో సేవలు అందుబాటులోకి వస్తాయి. ప్రతి సోమవారం సాయంత్రం 5:50 గంటలకు అయోధ్య కంటోన్మెంట్ నుంచి బయలుదేరి, మంగళవారం మధ్యాహ్నం 12:40 గంటలకు (నేపాల్ కాలమానం ప్రకారం) జనక్‌పూర్ ధామ్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ప్రతి శనివారం మధ్యాహ్నం 1:10 గంటలకు జనక్‌పూర్ ధామ్ నుంచి బయలుదేరి, ఆదివారం ఉదయం 8:10 గంటలకు అయోధ్యకు చేరుకుంటుంది. ఉత్తరప్రదేశ్, బిహార్ రాష్ట్రాల్లోని పలు ప్రధాన నగరాలు, పట్టణాల మీదుగా ఈ రైలు ప్రయాణిస్తుంది. అయోధ్య ధామ్, మన్యాపూర్, బస్తీ, గోరఖ్‌పూర్,



నర్కటియాగంజ్, రక్సౌల్, సీతామర్హి, శిషో, మధుబని, జయనగర్ స్టేషన్లలో దీనికి హాల్ట్‌లు కల్పించారు. మొత్తం 17 ఆధునిక కోచ్‌లతో ఈ రైలు నడుస్తుంది. ఇందులో 8 ఏసీ కోచ్‌లు, 7 స్లీపర్ కోచ్‌లు, దివ్యాంగులకు అనుకూలమైన ఒక లగేజీ కోచ్, పవర్ కార్ ఉంటాయి. ఈ రైలు సౌకర్యం వల్ల ఇరు దేశాల భక్తులు, పర్యాటకులు రామాయణ సర్క్యూట్‌లోని ప్రధాన పుణ్యక్షేత్రాలను సులభంగా సందర్శించే వీలు కలుగుతుంది. ఉత్తరప్రదేశ్, బిహార్, నేపాల్ సరిహద్దు ప్రాంతాల్లోని స్థానిక వ్యాపారులు, పర్యాటక నిర్వాహకులు, హస్తకళాకారులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. విద్య, వ్యాపార, కుటుంబ అవసరాల కోసం సరిహద్దు దాటి ప్రయాణించే ప్రజలకు ఇది ఎంతో సౌకర్యవంతంగా మారనుంది.

ఏడేళ్లపాటు పీసీసీ అధ్యక్షుడిగా పనిచేశా..మంత్రి ఉత్తమ్ కీలక వ్యాఖ్యలు!..



హైదరాబాద్, తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాల్లో కీలకంగా ఉన్న గాంధీ భవన్‌తో తనకు ఎంతో భావోద్వేగ అనుబంధం ఉందని రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలోనూ తాను పార్టీ కోసం పనిచేశానని గుర్తు చేసుకున్నారు. గాంధీ భవన్‌లో తెలంగాణ కాంగ్రెస్ నూతన ఇన్‌ఛార్జ్ బీఏం సందీప్‌తో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పార్టీ అంతర్గత వ్యవహారాలు, తాజా రాజకీయ పరిణామాలు, ప్రభుత్వ పనితీరు తదితర అంశాలపై చర్చించారు.సమావేశం అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. గాంధీ భవన్‌తో తనకు ప్రత్యేకమైన అనుబంధం ఉందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సమయంలో ఏడేళ్లపాటు పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించిన విషయాన్ని గుర్తుచేసుకున్నారు. "గాంధీ భవన్‌తో నాకు సెంటిమెంటల్, ఎమోషనల్ అటాచ్‌మెంట్ ఉంది" అని వ్యాఖ్యానించారు. పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా పనిచేసిన అనుభవం తనకు ఉందని తెలిపారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పూర్తి నిబద్ధతతో పనిచేస్తున్నామని ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. తన శాఖలో అద్భుతమైన పనితీరు కొనసాగుతోందని పేర్కొన్నారు. ఒక్కరోజు కూడా విరామం తీసుకోకుండా, ఒక్క గంట సమయాన్ని కూడా వృథా చేయకుండా విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని స్పష్టం చేశారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనపై మంత్రి ఉత్తమ్ విమర్శలు గుప్పించారు. నాటి ప్రభుత్వ హయాంలో మాటలు ఎక్కువగా ఉండేవని, ఆచరణలో పనులు తక్కువగా జరిగేవని వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ బోగస్ అని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం మాటలకంటే చేతలకే ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.ఇదే సమావేశంలో పాల్గొన్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా పార్టీ వ్యవహారాలపై స్పందించారు. తెలంగాణ కాంగ్రెస్ నూతన ఇన్‌ఛార్జ్ బీఏం సందీప్‌తో పార్టీకి సంబంధించిన పలు అంశాలపై చర్చించినట్లు తెలిపారు.

నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు.. అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరిక

హైదరాబాద్,గ్లోబల్ సమిట్ ఏర్పాట్లలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. సమ్మిట్‌కు దేశ, విదేశాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రతినిధులు హాజరుకానున్న నేపథ్యంలో ఏర్పాట్లన్నీ పకడ్బందీగా ఉండాలని స్పష్టం చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో గ్లోబల్ సమిట్ ఏర్పాట్లపై అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రి శ్రీధర్‌బాబు, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎస్ సంజయ్ జాజు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. సమ్మిట్‌కు వచ్చే ప్రతినిధులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు.

ప్రభుత్వ విద్యార్థులకు అవకాశం

గ్లోబల్ సమిట్‌లో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఏర్పాట్లు చేయాలని సీఎం సూచించారు. సమ్మక్క-సారలమ్మ ఆలయంలోని తోరణాల నమూనాలను సమ్మిట్‌లో ఉపయోగించాలని అధికారులకు తెలిపారు. సమ్మిట్‌లో భాగంగా నిర్వహించే ఎయిర్ షోతో పాటు ఇతర కార్యక్రమాలను వీక్షించే అవకాశం ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు కల్పించాలని ఆదేశించారు. ఫేషియల్ రికగ్నిషన్ ద్వారా ప్రతినిధులకు ప్రవేశం కల్పించాలని, వారితో మర్యాదపూర్వకంగా వ్యవహరించేలా విధుల్లో ఉండే అధికారులు, సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. ప్రతినిధుల కోసం ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేయడంతో పాటు మెరుగైన ఇంటర్నెట్ నెట్‌వర్క్ సదుపాయం కల్పించాలన్నారు. ప్రతి ప్రతినిధికి అవసరమైన సహకారం అందించేందుకు



లైజనింగ్ ఆఫీసర్ల వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

ప్రముఖులకు ఆహ్వానాల బాధ్యత మంత్రులకు

సమ్మిట్‌కు దేశ, విదేశాల నుంచి వచ్చే ప్రముఖులకు ఆహ్వానాలు పంపే విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని రేవంత్ రెడ్డి సూచించారు. ముఖ్యమైన ప్రతినిధులకు ఆహ్వానాలు పంపే బాధ్యతను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్‌బాబులకు అప్పగించాలని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా పేరొందిన విశ్వవిద్యాలయాలు సమ్మిట్‌లోని ఎడ్యుకేషన్ పెవిలియన్‌లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

'కోటి ఓట్లు.. 90 సీట్లు' టార్గెట్‌గా ఎన్నికలకు వెళ్తాం

హైదరాబాద్, 'కోటి ఓట్లు.. 90 సీట్లు' లక్ష్యంగా రానున్న ఎన్నికలకు వెళ్తామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. దేశంలో మరే రాష్ట్రం లోనూ లేని విధంగా తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలవుతు న్నాయని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా పార్టీ శ్రేణులు సమష్టిగా ముందుకు సాగుతాయని తెలిపారు. గాంధీభవన్‌లో సోమవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. రాష్ట్ర కాంగ్రెస్ నూతన ఏఐసీసీ ఇన్‌ఛార్జి బిఎం సందీప్‌కు ఘన స్వాగతం పలికినట్లు చెప్పారు. సందీప్ పొలిటికల్ అఫైర్స్ కమిటీ, అడ్వైజరీ కమిటీ సమావేశాల్లో పాల్గొన్నారని వెల్లడించారు. ఈ సమావేశాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సమగ్రంగా వివరించినట్లు తెలిపారు.

ఈ నెల 26న రాష్ట్రంలో 'సంవిధాన్ రక్షక్' ర్యాలీ

ఇవాళ సాయంత్రం ఏఐసీసీ ఇన్‌ఛార్జి బి.ఎం. సందీప్ డీసీసీ అధ్యక్షులతో



సంపాదకీయం

మంగళవారం 24-11-2026

పరిశోధనా మార్గంలో 'కాంతిరేఖ'

మృదంగంపై వేళ్లు కదులుతుంటే సంగీతాభిమానులకు లయ వినిపిస్తుంది. భౌతిక శాస్త్రవేత్త చంద్రశేఖర వేంకట రామన్‌కు అందులో ఒక పరిశోధనా సమస్య కూడా కనిపించింది. సాధారణ వాద్యాల ధ్వనికీ, మృదంగం వంటి భారతీయ వాద్యాల నాదానికీ తేడా ఎందుకుంది? వాటికి స్పష్టమైన శ్రుతి ఎలా వస్తోంది? సంగీత సభలో వినిపించే నాదాన్ని ప్రయోగశాలలో పరిశీలించదగిన ప్రశ్నగా మలచడం రామన్ ప్రత్యేకత. నేడు సి.వి.రామన్ వర్ధంతి సందర్భంగా గుర్తుచేసుకోవాల్సింది ఈ పరిశోధనా దృష్టిని కూడా. రామన్ పేరు చెప్పగానే మనకు 'రామన్ ప్రభావం', 1930 నాటి భౌతికశాస్త్ర నోబెల్ బహుమతి గుర్తుకొస్తాయి. అయితే భారత వైజ్ఞానిక రంగానికి ఆయన చేసిన సేవను ఆ పురస్కారంతోనే కొలవలేం. భారత్‌లోనే ప్రపంచస్థాయి మౌలిక పరిశోధన చేయవచ్చని ఆయన నిరూపించారు. పరాయి పాలనలో, పరిశోధనకు అవకాశాలు పరిమితంగా ఉన్న కాలంలో సాధించిన విజయం అది. కలకత్తాలో రామన్ చేసిన కాంతి పరిశోధనలు ప్రపంచ విజ్ఞానంలో శాశ్వత స్థానం సంపాదించాయి. హరగోవింద్ ఖొరానా వంటి భారతీయ శాస్త్రవేత్తలు విదేశాల్లో పరిశోధనలు చేసి అంతర్జాతీయ గుర్తింపు పొందారు. వారికి భిన్నంగా నోబెల్ బహుమతిని సాధించిన పరిశోధనను ఇండియాలోనే చేయడం రామన్ విశిష్టత. 1907లో ప్రభుత్వ ఆర్థికశాఖలో ఉద్యోగంలో చేరిన రామన్, ఆ బాధ్యతల మధ్యనే కలకత్తాలోని ఇండియన్ అసోసియేషన్ ఫర్ ద కల్టివేషన్ ఆఫ్ సైన్స్ ప్రయోగశాలలో పరిశోధనలు కొనసాగించారు. 1917లో కలకత్తా విశ్వవిద్యాలయంలో భౌతికశాస్త్ర ఆచార్య పదవిని స్వీకరించారు. వ్యక్తిగత తపనకు, పని చేసేందుకు అందుబాటులో ఉన్న ప్రయోగశాల తోడైతే ఎంతటి ఫలితాలు సాధ్యమవుతాయో ఆయన ప్రయాణం చూపిస్తుంది.

తెలుగు నేలతోనూ...

రామన్ స్వయంగా సంస్థల నిర్మాతగా ఎదిగారు. బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో పరిశోధనలకు నాయకత్వం వహించారు. 1934లో ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌ను స్థాపించారు. 1948లో రామన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌ను స్థాపించారు. పరిశోధనలకు ప్రయోగశాలలు, ఫలితాలను పంచుకోవడానికి పత్రికలు, శాస్త్రవేత్తలు కలిసి ఆలోచించడానికి వేదికలు అవసరం. ఆయన కృషిలో ఇవన్నీ భాగమయ్యాయి. తెలుగు నేలతోనూ రామన్‌కు ప్రత్యేకమైన అనుబంధం ఉంది. ఆయన బాల్యవిద్య విశాఖపట్నంలో సాగింది. తర్వాత ఆంధ్ర విశ్వవిద్యాలయంలో భౌతికశాస్త్ర పరిశోధనలకు పునాదులు వేయడంలోనూ రామన్ తోడ్పడ్డారు. 1932లో ఆయన మార్గదర్శకత్వంలోనే తమ భౌతికశాస్త్ర విభాగం ఏర్పడిందని విశ్వవిద్యాలయ చరిత్ర పేర్కొంటోంది.

తాను పరిశోధనలు చేయడంతోపాటు, ఇతరులు కూడా చేసేందుకు అవకాశాలను కల్పించాలన్న ఆయన దృష్టికి ఇది మరో ఉదాహరణ. రామన్ పరిశోధనల్లో మరో విశేషం మన సాంస్కృతిక జీవితంలోని అంశాలకు ఇచ్చిన స్థానం. మృదంగం, తబలా వంటి వాద్యాల ధ్వనిని ఆయన శాస్త్రీయంగా పరిశీలించారు. సాధారణ చర్మ వాద్యంలో వెలువడే వివిధ కంపనాల పౌనఃపున్యాలు, తీగ వాద్యాల్లో మాదిరిగా సరళమైన నిష్పత్తుల్లో ఉండవు. మృదంగం, తబలాల్లో చర్మంపై ప్రత్యేకంగా పూసే పదార్థం ఈ కంపనాలను మార్చి, స్పష్టమైన శ్రుతిని కలిగించే ఉపస్వరాలు ఏర్పడేందుకు దోహదం చేస్తుంది. తరతరాల వాద్యనిర్మాతల అనుభవంలో రూపుదిద్దుకున్న నైపుణ్యాన్ని రామన్ భౌతికశాస్త్ర పరిశీలనకుతీసుకొచ్చారు.ఇందులో నేటి పరిశోధకులకు విలువైన సందేశం ఉంది. పరిశోధనా ప్రశ్నల కోసం మన చుట్టూ ఉన్న జీవితాన్ని నిశితంగా చూడాలి. సంగీతం, వ్యవసాయం, చేతివృత్తులు,జీవవైవిధ్యం– ఎన్నో రంగాల్లో పరిశీలించాల్సిన అంశాలున్నాయి. సంప్రదాయంలో ఉన్నదంతా శాస్త్రీయంగా సరైనదని ముందే నిర్ణయించుకోకుండా, ఆయా పద్ధతులు ఎలా పనిచేస్తున్నాయో ప్రయోగాలతో తెలుసుకోవాలి. ఆధారాలతో నిలిచే వివరణలను ప్రపంచానికి అందించాలి. స్థానిక అనుభవం నుంచి విశ్వవ్యాప్త విజ్ఞానం పుట్టే మార్గం ఇదే.

నేర్చుకునే వెసులుబాటు

రామన్ విజయాన్ని చూసి తక్కువ వనరులే చాలని నిర్ణయించుకోవడం కూడా పొరపాటు. నేటి పరిశోధనకు తగిన నిధులు, ఆధునిక పరికరాలు, నిపుణుల సహకారం అవసరం. వాటితోపాటు సొంత ప్రశ్నలు అడిగే స్వేచ్ఛ, దీర్ఘకాలం ఒక సమస్యపై పనిచేసే అవకాశం, విఫలమైన ప్రయోగం నుంచి నేర్చుకునే వెసులుబాటు ఉండాలి. పరిశోధకుల సమయం అనవసరమైన పరిపాలనా భారంలో కరిగిపోకుండా చూడాలి. పాఠశాలల్లోనూ ఈ దృష్టి పెరగాలి. రామన్ ప్రభావం నిర్వచనాన్ని నేర్చుకున్న పిల్లలకు ఒక వాద్యం ఎందుకు అలా మోగుతుందో పరిశీలించే అవకాశం ఇవ్వాలి. ప్రశ్నించడం, కొలవడం, పోల్చడం, తమ ఊహను పరీక్షించడం అలవడాలి. సైన్సు పాఠ్యపుస్తకంలో చదివే సమాచారంతోపాటు, ప్రపంచాన్ని తెలుసుకునే పద్ధతి పరిచయం కావాలి. రామన్ మనకు ఒక ఆవిష్కరణను అందించారు; పరిశోధనకు ఒక దారినీ చూపించారు. భారత నేలపై పనిచేస్తూ, భారత జీవితంలో ప్రశ్నలను వెతుకుతూ, ప్రపంచ విజ్ఞానానికి తోడ్పడవచ్చని నిరూపించారు.

ఏపీ వ్యూహాలు..దక్షిణాది రాష్ట్రాల్లోచర్చ



అమరావతి, పెట్టుబడుల వేటలో దూసుకెళ్తున్న ఆంధ్రప్రదేశ్.. రెండేళ్లలోనే తొమ్మిదో స్థానం నుంచి రెండో స్థానానికి.. రూ.32.49 లక్షల కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు.. తమిళనాడులో డేటా లీక్ ఆరోపణల కలకలం.. అభివృద్ధి పోటీలో ఏపీ దూకుడును తట్టుకోలేకపోతున్నాయా పొరుగు రాష్ట్రాలు? ఇప్పుడు ఇవే దేశవ్యాప్తంగా పొరుగు రాష్ట్రాల్లో ఏపీ గురించి నడుస్తున్న చర్చ..ఒకప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు హైదరాబాద్ ఆర్థిక వెన్నెముకగా ఉండేది. రాష్ట్ర విభజన తర్వాత ఆ నగరాన్ని కోల్పోయిన ఆంధ్రప్రదేశ్‌కు కొత్త రాజధాని, పరిశ్రమలు, పెట్టుబడులు, ఉద్యోగాల కల్పన వంటి అంశాలు అతిపెద్ద సవాళ్లుగా మారాయి. ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్న రాష్ట్రం.. ఇప్పుడు పెట్టుబడుల ఆకర్షణలో దేశంలోని అగ్రగామి రాష్ట్రాలకు గట్టి పోటీ ఇస్తోంది. ముఖ్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి నారా లోకేశ్ అనుసరిస్తున్న దూకుడైన విధానాలు ఏపీకి కొత్త గుర్తింపును తీసుకొస్తున్నాయి.అయితే ఏపీ సాధిస్తున్న ఈ పురోగతి ఇప్పుడు కేవలం రాష్ట్రానికే పరిమితమైన అంశంగా కనిపించడం లేదు. దక్షిణాదిలో పారిశ్రామికంగా బలంగా ఉన్న తమిళనాడు, కర్ణాటక వంటి రాష్ట్రాల్లోనూ చర్చకు దారితీస్తోంది. పెట్టుబడుల కోసం ఒకప్పుడు ఏపీ ఇతర రాష్ట్రాలతో పోటీ పడాల్సి వస్తే.. ఇప్పుడు ఏపీ వైపు పెట్టుబడులు మళ్లడం పొరుగు రాష్ట్రాల్లో అసౌకర్యానికి కారణమవుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి గణాంకాల ప్రకారం దేశవ్యాప్తంగా కొత్త ప్రాజెక్టుల ప్రకటనల్లో ఆంధ్రప్రదేశ్ వాటా గణనీయంగా పెరిగింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 3.01 శాతంగా ఉన్న ఏపీ వాటా.. 2025-26 నాటికి ఏకంగా 15.36 శాతానికి చేరింది. దీంతో దేశవ్యాప్తంగా తొమ్మిదో స్థానంలో ఉన్న రాష్ట్రం రెండో స్థానానికి ఎగబాకింది.ఇదే సమయంలో కర్ణాటక పరిస్థితి ఇందుకు భిన్నంగా కనిపిస్తోంది. 2023-24లో 8.25 శాతంగా ఉన్న ఆ రాష్ట్ర వాటా 2025-26 నాటికి 5.67 శాతానికి పడిపోయింది. జాతీయ స్థాయిలో నాలుగో స్థానం నుంచి ఆరో స్థానానికి దిగజారింది.ఈ గణాంకాలు దక్షిణాది రాష్ట్రాల మధ్య పెట్టుబడుల ఆకర్షణలో మారుతున్న సమీకరణాలను స్పష్టం చేస్తున్నాయి. అయితే ఈ మార్పునకు ఒక్క కారణమే ఉందని చెప్పలేం. ప్రభుత్వ విధానాలు, మౌలిక సదుపాయాలు, భూమి లభ్యత, అనుమతుల వేగం, పారిశ్రామిక అవసరాలు వంటి అనేక అంశాలు పెట్టుబడుల నిర్ణయాలను ప్రభావితం చేస్తాయిపెట్టుబడుల విషయంలో ఆంధ్రప్రదేశ్ దూకుడుకు విశాఖపట్నంలో జరిగిన సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ 2026 మరో ఉదాహరణగా నిలిచింది. రెండు రోజుల పాటు జరిగిన ఈ సదస్సు ముగిసే సమయానికి రాష్ట్రానికి రూ.9,88,957 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చాయి. మొత్తం 303 అవగాహన ఒప్పందాలు కుదిరాయి. వీటి ద్వారా 3,48,309 మందికి ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందని ప్రభుత్వం వెల్లడించింది.ఈ పెట్టుబడుల్లో అక్టోబర్ 7 నుంచి 26 వరకు జరిగిన ప్రాంతీయ సమావేశాల్లో 194 ఎంఓయూల ద్వారా రూ.86,522 కోట్ల పెట్టుబడులకు ప్రతిపాదనలు వచ్చాయి. వీటి ద్వారా 1,47,951 ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది.విశాఖ సదస్సులో మరో 109 ఒప్పందాలు కుదిరాయి. వీటి విలువ రూ.9,02,434 కోట్లు కాగా, సుమారు 2,00,358 ఉద్యోగాల కల్పనకు అవకాశం ఉందని అంచనా.ఇక 2024 జూన్ నుంచి ఇప్పటివరకు రాష్ట్రానికి అందిన మొత్తం పెట్టుబడి ప్రతిపాదనలు రూ.32.49 లక్షల కోట్లకు చేరినట్లు ప్రభుత్వం పేర్కొంది. ఈ సంఖ్యలు కేవలం పెట్టుబడుల ప్రకటనలే అయినప్పటికీ, దేశీయ, అంతర్జాతీయ పారిశ్రామిక వర్గాల దృష్టిని ఏపీ ఆకర్షిస్తోందనే సంకేతాన్ని ఇస్తున్నాయి.ఆంధ్రప్రదేశ్ పెట్టుబడుల వేటలో కనిపిస్తున్న వేగం వెనుక రాజకీయ నాయకత్వం అనుసరిస్తున్న వ్యూహం కీలకంగా కనిపిస్తోంది. రాష్ట్ర విభజన తర్వాత హైదరాబాద్‌ను కోల్పోయిన ఏపీకి పారిశ్రామికంగా కొత్త పునాది వేయాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో చంద్రబాబు ప్రభుత్వం పెట్టుబడిదారులకు అనుకూలమైన వాతావరణం కల్పించడంపై దృష్టి పెట్టింది.పరిశ్రమలకు అవసరమైన భూములు, మౌలిక సదుపాయాలు, వేగవంతమైన అనుమతులు, ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తామనే హామీలతో పారిశ్రామికవేత్తలను ఆకర్షిస్తోంది. మరోవైపు మంత్రి నారా లోకేశ్ పెట్టుబడిదారులతో నేరుగా సంప్రదింపులు జరుపుతూ రాష్ట్రానికి పరిశ్రమలను తీసుకురావడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.ప్రభుత్వం అనుసరిస్తున్న ఈ విధానాన్ని కేవలం పెట్టుబడుల సేకరణగా కాకుండా.. రాష్ట్ర ఆర్థిక పునర్నిర్మాణ ప్రయత్నంగా చూడాల్సి ఉంటుంది. ఎందుకంటే పెట్టుబడులు వస్తేనే పరిశ్రమలు ఏర్పడతాయి. పరిశ్రమలు వస్తేనే స్థానికంగా ఉద్యోగాలు పెరుగుతాయి. ఆర్థిక కార్యకలాపాలు విస్తరిస్తేనే రాష్ట్ర ఆదాయం పెరిగే అవకాశం ఉంటుందిఇక్కడే అసలు ఆసక్తికరమైన రాజకీయ, పారిశ్రామిక పరిణామం చోటుచేసుకుంది. దక్షిణాదిలో పారిశ్రామికంగా బలమైన రాష్ట్రంగా పేరున్న తమిళనాడులో పెట్టుబడుల వ్యవహారం వివాదానికి దారితీసింది.తమిళనాడులోని విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వం, పెట్టుబడుల ఆకర్షణకు కీలకమైన గైడెన్స్ తమిళనాడు సంస్థలోని 15 మంది అధికారులను తొలగించినట్లు వార్తలు వచ్చాయి. ఆ సంస్థకు సంబంధించిన కీలక పెట్టుబడి సమాచారాన్ని కొందరు ఆంధ్రప్రదేశ్‌కు చేరవేశారనే అనుమానాలు ఈ వ్యవహారానికి కారణమని ప్రచారం జరిగింది.ముఖ్యంగా గైడెన్స్ తమిళనాడులో గతంలో పనిచేసిన ముగ్గురు ఉద్యోగులు ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డులో చేరడం ఈ వివాదానికి కేంద్రంగా మారింది.అయితే ఇక్కడ ఒక విషయాన్ని గమనించాలి. ఒక రాష్ట్రంలో పనిచేసిన ఉద్యోగులు మరో రాష్ట్రంలో ఉద్యోగాలు పొందడం సాధారణమైన పరిణామమే. సంబంధిత ఉద్యోగుల వాదన ప్రకారం, తమ ఒప్పందాల్లో ఇతర సంస్థల్లో పనిచేయకుండా నిరోధించే నిబంధనలు లేవు. అంతేకాకుండా, వారు వివాదం తెరపైకి రాకముందే సంస్థను వీడినట్లు చెబుతున్నారు.ఇప్పటివరకు పెట్టుబడుల సమాచారాన్ని దొంగిలించారనే ఆరోపణలకు సంబంధించి బహిరంగంగా నిరూపితమైన ఆధారాలు వెలుగులోకి రాలేదు. ఈ వివాదంపై తమిళనాడులోని ప్రతిపక్ష డీఎంకే కూడా స్పందిస్తూ, దశాబ్దాల చరిత్ర ఉన్న సంస్థను రాజకీయ వివాదంలోకి లాగడంపై అభ్యంతరం వ్యక్తం చేసినట్లు కథనాలు వెలువడ్డాయి.ఈ వివాదాన్ని మరో కోణంలో పరిశీలిస్తే అసలు ప్రశ్న ఉద్యోగుల బదిలీ గురించి కాదు.. పెట్టుబడులను ఆకర్షించే విషయంలో రాష్ట్రాల మధ్య పెరుగుతున్న పోటీ గురించి.ఒక రాష్ట్రంలో పనిచేసిన అనుభవజ్ఞులైన ఉద్యోగులు మరో రాష్ట్రానికి వెళ్లడం ద్వారా తమ నైపుణ్యాన్ని, అనుభవాన్ని కొత్త సంస్థకు అందించవచ్చు. ఇది సాధారణ కార్పొరేట్ పరిణామమే. అయితే పెట్టుబడుల సమాచారం, వ్యాపార వ్యూహాలు వంటి అంశాలు ఇందులో ఉన్నాయనే అనుమానాలు తలెత్తినప్పుడు అది సహజంగానే వివాదానికి దారితీస్తుంది.కానీ ఏపీకి పెట్టుబడులు రావడానికి కారణం కేవలం ఇతర రాష్ట్రాల నుంచి ఉద్యోగులు రావడమేనా? లేక రాష్ట్రంలో ఏర్పడుతున్న పారిశ్రామిక వాతావరణం, ప్రభుత్వ విధానాలు, నాయకత్వం చొరవ కూడా కారణమా? అన్నది ఆలోచించాల్సిన అంశం.పెట్టుబడిదారులు వందల, వేల కోట్ల రూపాయలు వెచ్చించే ముందు అనేక అంశాలను పరిశీలిస్తారు. రవాణా సౌకర్యాలు, పోర్టులు, విద్యుత్, నీటి లభ్యత, భూమి, కార్మికుల నైపుణ్యం, ప్రభుత్వ విధానాల స్థిరత్వం వంటి అంశాలు వారి నిర్ణయాల్లో కీలకం. కేవలం ఒక ఉద్యోగి ఇచ్చే సమాచారంతో ఇంతటి భారీ పెట్టుబడి నిర్ణయాలు తీసుకోవడం సాధ్యమయ్యే విషయం కాదు.దేశంలో పెట్టుబడుల కోసం రాష్ట్రాల మధ్య పోటీ ఉండటం కొత్త విషయం కాదు. గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ వంటి రాష్ట్రాలు ఎన్నో సంవత్సరాలుగా పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఇప్పుడు ఆ పోటీలో ఆంధ్రప్రదేశ్ కూడా దూకుడుగా ముందుకు వస్తోంది.ఒక రాష్ట్రానికి పెట్టుబడులు వస్తే మరో రాష్ట్రానికి నష్టం తప్పనిసరి కాదు. సరైన విధానాలు, మెరుగైన మౌలిక సదుపాయాలు, సమర్థవంతమైన పాలన ఉంటే ప్రతి రాష్ట్రం పెట్టుబడులను ఆకర్షించవచ్చు. కానీ పోటీలో వెనుకబడినప్పుడు ఇతరుల విజయాలపై అనుమానాలు వ్యక్తం చేయడం వల్ల ప్రయోజనం ఉండదు.చంద్రబాబు, లోకేశ్ నాయకత్వంలో ఏపీ సాధిస్తున్న పెట్టుబడుల పురోగతి నిజంగా స్థిరమైన అభివృద్ధిగా మారుతుందా లేదా అన్నది రాబోయే రోజుల్లో తేలుతుంది. ఎందుకంటే ఎంఓయూలు కుదరడం ఒక దశ మాత్రమే. అవి వాస్తవ పరిశ్రమలుగా మారాలి. ఉద్యోగాలు కల్పించాలి. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఆదాయాన్ని తీసుకురావాలి.

సికింద్రాబాద్ టూ కరీంనగర్‌కు నమో భారత్



కరీంనగర్,ఉపాధి, విద్య, వ్యాపార అవసరాల కోసం హైదరాబాద్‌లో స్థిరపడిన ఉత్తర తెలంగాణ ప్రజలకు సొంతూళ్లకు రాకపోకలు పెద్ద సమస్యగా మారాయి. ముఖ్యంగా నగర తూర్పు ప్రాంతాలైన ఘట్‌కేసర్, చర్లపల్లి, మౌలాలి, బోడుప్పల్, తార్నాక తదితర ప్రాంతాల్లో నివసిస్తున్న ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల ప్రజలు స్వస్థలాలకు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్సుల్లో ప్రయాణిస్తే అధిక ఛార్జీలు, ట్రాఫిక్ సమస్యలు వెంటాడుతుండగా.. రైళ్లలో వెళ్లాలంటే గంటల తరబడి సమయం వెచ్చించాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో సికింద్రాబాద్ నుంచి పెద్దపల్లి, కాజీపేట మీదుగా కరీంనగర్‌కు నమో భారత్ ర్యాపిడ్ రైలు లేదా మెము రైలు ప్రవేశపెట్టాలనే డిమాండ్ పెరుగుతోంది. ప్రయాణికుల సంఘాల ప్రతినిధులు సైతం ఈ ప్రతిపాదనను ముందుకు తెస్తున్నారు. ఈ మార్గంలో వేగవంతమైన రైలు సేవలు అందుబాటులోకి వస్తే హైదరాబాద్‌లో నివసించే ఉత్తర తెలంగాణ ప్రజలకు ప్రయాణ కష్టాలు గణనీయంగా తగ్గుతాయని అభిప్రాయపడుతున్నారు.ప్రస్తుతం హైదరాబాద్–కరీంనగర్ మధ్య ప్రయాణానికి ఆర్టీసీ బస్సులే ప్రధాన రవాణా సాధనంగా ఉన్నాయి. ప్రతి ఐదు నిమిషాలకు ఎక్స్‌ప్రెస్, డీలక్స్, రాజధాని, సూపర్ లగ్జరీ బస్సులు అందుబాటులో ఉన్నప్పటికీ ప్రయాణానికి సుమారు నాలుగు గంటలు పడుతోంది. కనీస టికెట్ ధర రూ.220 నుంచి ప్రారంభమవుతుండగా.. లగ్జరీ బస్సుల్లో ఛార్జీలు మరింత ఎక్కువగా ఉంటున్నాయి. పండగలు, వారాంతాల్లో ప్రయాణికుల రద్దీ పెరిగితే బస్సుల్లో సీట్లు దొరకడం కూడా కష్టంగా మారుతోంది. మరోవైపు రైలు ప్రయాణం చౌకగా ఉన్నప్పటికీ ప్రస్తుతం కరీంనగర్ నుంచి కాచిగూడకు నడుస్తున్న డెమూ ప్యాసింజర్ రైలు ప్రయాణికులకు పెద్దగా ఉపయోగపడటం లేదు. ఈ రైలు జగిత్యాల, నిజామాబాద్, కామారెడ్డి, మేడ్చల్ మీదుగా సుమారు 309 కిలోమీటర్లు చుట్టూ తిరిగి వెళ్తోంది. దీంతో గమ్యస్థానానికి చేరుకోవడానికి ఎనిమిది నుంచి తొమ్మిది గంటలు పడుతోంది. నిజామాబాద్–మేడ్చల్ మార్గంలో సింగిల్ రైల్వే లైన్ ఉండటం, గరిష్ఠ వేగపరిమితి గంటకు 110 కిలోమీటర్లుగా ఉండటం వల్ల ప్రయాణ సమయం మరింత పెరుగుతోంది. బస్సులో నాలుగు గంటల్లో చేరుకునే దూరానికి రైలులో దాదాపు రెట్టింపు సమయం వెచ్చించాల్సి వస్తోంది.కరీంనగర్ నుంచి పెద్దపల్లి, కాజీపేట మీదుగా సికింద్రాబాద్‌కు రైలు నడిపేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. పెద్దపల్లి–కాజీపేట మధ్య మూడో రైల్వే లైన్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చింది. కాజీపేట నుంచి ఘట్‌కేసర్ వరకు రెండో లైన్, ఘట్‌కేసర్ నుంచి సికింద్రాబాద్ వరకు నాలుగో రైల్వే మార్గం అందుబాటులో ఉన్నాయి. పెద్దపల్లి నుంచి సికింద్రాబాద్ వరకు రైలు గంటకు 130 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే సామర్థ్యం ఉంది. కరీంనగర్–పెద్దపల్లి మధ్య ఉన్న 35 కిలోమీటర్ల సింగిల్ లైన్‌లోనూ గంటకు 110 కిలోమీటర్ల వేగంతో రైళ్లను నడిపే అవకాశం ఉందని ప్రతిపాదకులు పేర్కొంటున్నారు. ఈ మార్గంలో నమో భారత్ ర్యాపిడ్ రైలు లేదా మెము రైలును ప్రవేశపెడితే సికింద్రాబాద్–కరీంనగర్ మధ్య ప్రయాణ సమయాన్ని మూడు నుంచి మూడున్నర గంటల నుంచి నాలుగు గంటలలోపు పరిమితం చేయవచ్చని అంచనా వేస్తున్నారు.కొత్త రైలు అందుబాటులోకి వస్తే సామాన్య, మధ్యతరగతి ప్రయాణికులకు బస్సులతో పోలిస్తే చౌకైన ప్రయాణ సదుపాయం లభిస్తుంది. ముఖ్యంగా ఉప్పల్, ఘట్‌కేసర్, చర్లపల్లి, మౌలాలి, సికింద్రాబాద్ ప్రాంతాల్లో నివసించే ఉత్తర తెలంగాణ ప్రజలకు తమ నివాస ప్రాంతాలకు సమీపంలోని స్టేషన్ల నుంచే రైలు ఎక్కే అవకాశం ఉంటుంది. దీనివల్ల నగరంలోని రద్దీ ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గడంతో పాటు రోడ్డు ప్రయాణంపై ఆధారపడటం కూడా తగ్గుతుంది. కరీంనగర్, పెద్దపల్లి, కాజీపేట, సికింద్రాబాద్ మధ్య విద్యా, ఉద్యోగ, వ్యాపార సంబంధాలు మరింత బలోపేతమవుతాయి. హైదరాబాద్‌లో పనిచేస్తూ స్వగ్రామాలకు తరచూ వెళ్లే ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారులకు ఈ రైలు సేవలు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయి. ఇప్పటికే రైల్వే మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్న నేపథ్యంలో ప్రయాణికుల అవసరాలను పరిగణనలోకి తీసుకుని రైల్వే శాఖ నమో భారత్ లేదా మెము రైలు ప్రతిపాదనను పరిశీలించాలనే డిమాండ్ వినిపిస్తోంది.

స్టాండ్ విత్ జెన్సెన్ కు భారీగా మద్దతు

న్యూయార్క్, ఎన్విడియా సీఈఓగా జెన్సెన్ హువాంగ్‌ను తిరిగి నియమించాలంటూ సాగుతున్న ప్రచారానికి టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ మద్దతు తెలిపారు. 33 ఏళ్ల క్రితం తాను సహ వ్యవస్థాపకుడిగా మొదలైన సంస్థకు హువాంగ్ రాజీనామా చేసిన 2 రోజుల తర్వాత, ఆయనను తిరిగి విధుల్లోకి తీసుకోవాలంటూ మద్దతు తెలిపింది. ఈ పిటిషన్‌పై తాను కూడా సంతకం చేస్తున్నట్లు మస్క్ 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. 'స్టాండ్ విత్ జెన్సెన్' అనే వాలంటీర్ల వెబ్‌సైట్ ద్వారా ఎన్విడియా బోర్డుకు రాసిన బహిరంగ లేఖపై ఇప్పటివరకు 43,000 మందికి పైగా సంతకాలు చేయడం విశేషం. ప్రతి 30 సెకన్లకు అప్‌డేట్ అయ్యే ఈ సైట్ వివరాల ప్రకారం, సంతకం చేసిన వారిలో 2,980 మంది ప్రస్తుత ఎన్విడియా ఉద్యోగులు, 454 మంది మాజీ ఉద్యోగులు, 24,097 మంది వాటాదారులు, 15,517 మంది ఇతర మద్దతుదారులు ఉన్నారు. అయితే ఈ ప్రచారానికి ఎన్విడియా గానీ, హువాంగ్ గానీ మద్దతు ఇవ్వలేదని, సంతకం చేసిన వారి హోదాలు సెల్ఫ్ అటెస్టెడ్ మాత్రమేనని నిర్వాహకులు తెలిపారు.ఎలాంటి సరైన విచారణ ప్రక్రియ లేకుండానే హువాంగ్‌ను తొలగించారని, వివాదంలో ఉన్న మహిళ గూఢచారి అనడానికి బోర్డు ఎలాంటి ఆధారాలు చూపలేదని ఈ లేఖలో పేర్కొన్నారు. కేవలం అనుమానాలు లేదా పరిచయాల ఆధారంగా జెన్సెన్ నాయకత్వం నుంచి తొలగించడం సరికాదని పేర్కొంటూ, స్వతంత్ర దర్యాప్తు పూర్తయ్యే వరకు ఆయనను తిరిగి ఎన్విడియా సీఈఓగా నియమించాలని లేదా ఆయన లేకపోవడం సంస్థకు ఎలా మేలు చేస్తుందో పూర్తి వివరాలతో వివరించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రచారంలో మస్క్‌తో పాటు ఎపిక్ గేమ్స్ సీఈఓ టిమ్ స్వీనీ, వై కాంబినేటర్‌కు చెందిన గ్యారీ టాన్, రెప్లిట్ సీఈఓ అమ్జాద్ మసాద్, కోహెరేకు చెందిన ఐడన్ గోమెజ్, పెట్టుబడిదారుడు గావిన్ బేకర్, బైనాన్స్ సహ వ్యవస్థాపకురాలు యి హి వంటి టెక్ ప్రముఖులు సైతం సంతకాలు చేశారు.మరోవైపు ఎన్విడియా ఉద్యోగులు సైతం హువాంగ్‌కు మద్దతుగా నిలుస్తున్నారు. సీనియర్ ఇంజనీర్ ఎర్విన్ కూమన్స్ స్పందించారు. హువాంగ్ వ్యక్తిగత జీవితంతో తమకు సంబంధం లేదని, నిబంధనల ఉల్లంఘన జరిగితే మాత్రమే చర్యలు తీసుకోవాల్సిందే కానీ ఆయనకు న్యాయ విచారణ అవకాశం ఇవ్వాలని కోరారు. తప్పులు చేసిన వారిని ఉద్యోగం నుండి తొలగించకుండా నేర్చుకునే అవకాశం ఇవ్వాలని జెన్సెన్ ఎప్పుడూ చెప్పేవారని, ఇప్పుడు ఆయనకు అదేవిధంగా మర్యాద ఇవ్వాలని సొల్యూషన్స్ ఆర్కిటెక్ట్ ఎలియాస్ సేయుమ్ అభిప్రాయపడ్డారు. కాగా, హువాంగ్ పట్ల వ్యతిరేకత లేదా ఎగతాళి చేసే వ్యాఖ్యలున్న సంతకాలను నిర్వాహకులు తిరస్కరిస్తున్నారు. సంస్థ అంతర్గత సలహా వేదికపై కూడా 1,600 మందికి పైగా ఉద్యోగులు హువాంగ్ రీఎంట్రీకి మద్దతుగా కామెంట్లు పెట్టారని, ఆయన ఎగ్జిట్ అవ్వడాన్ని సమర్థిస్తూ ఒక్క పోస్ట్ కూడా కనిపించలేదని వైర్డ్ రిపోర్ట్ పేర్కొంది.చైనా కోసం గూఢచర్యం చేస్తోందని అమెరికా నిఘా సంస్థలు అనుమానిస్తున్న మెగాస్పీడ్ ఎగ్జిక్యూటివ్ ఆలిస్ హువాంగ్‌తో మాజీ సీఈవో జెన్సెన్‌కు సంబంధం ఉన్నట్లు వార్తలు వచ్చాయి. దీనిపై నవంబర్ 8న ఉద్యోగులకు పంపిన మెమోలో తాను తన భార్యకు నమ్మకద్రోహం చేశానని హువాంగ్ అంగీకరించారు. ఆ తర్వాత నేరుగా ఆయనకు రిపోర్ట్ చేసే ఎన్విడియా హెల్త్‌కేర్ వైస్ ప్రెసిడెంట్ కింబర్లీ పావెల్‌తో పాటు మరో ఉద్యోగినితో కూడా ఆయనకు వివాహేతర సంబంధాలు ఉన్నట్లు ప్రచారం చేయడంతో నవంబర్ 12న హువాంగ్ ఎన్విడియా ప్రెసిడెంట్, సీఈఓ, బోర్డు మెంబర్ పదవులకు తక్షణమే రాజీనామా చేశారు.

బ్యాంక్ ఆఫ్ అమెరికాకు హైదరాబాద్ లో 8.28 కోట్ల అద్దె

హైదరాబాద్, హైదరాబాద్ మహానగరం మరోసారి తన సత్తా చాటింది. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు గమ్యస్థానంగా మారింది. ప్రపంచ బ్యాంకింగ్ దిగ్గజం బ్యాంక్ ఆఫ్ అమెరికా తమ భారత అనుబంధ సంస్థ బీఏ కంటిన్యూమ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా హైదరాబాద్ మాదాపూర్‌లోని మైండ్ స్పేస్ సైబరాబాద్లో ఏకంగా 10,10,467 చదరపు అడుగులు 1 మిలియన్ స్క్వేర్ ఫీట్ కంటే ఎక్కువ) ఆఫీసు స్థలాన్ని లీజుకు తీసుకుంది. కె.రహేజా ఐటీ పార్క్ (మైండ్ స్పేస్ బిజినెస్ పార్క్) ఖీఇఐ)

కమలానికి ఏమైంది...

రాజమండ్రి, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ చతికలపడిందనే చెప్పాలి. కూటమిలోని మిత్ర పక్షాలైన టీడీపీ, జనసేనలు మంచి స్ట్రయిక్ రేట్ తో విజయం సాధిస్తే బీజేపీ మాత్రం అనుకున్న స్థానాలను దక్కించుకోకపోగా, ఇచ్చిన స్థానాల్లోనూ ఓటమి చెంది రాష్ట్రంలో మా పరిస్థితి ఇక మారదన్న అభిప్రాయాన్నిపంపింది. కొన్ని చోట్ల అభ్యర్థుల ఎంపికతో పాటు పార్టీ నేతల ప్రచారంలో వైఫల్యాలు కూడా ఆ పార్టీ ఓటమికి కారణాలుగా చెబుతున్నారు. సమన్వయం సాధించుకోలేకపోవడం, ఓట్ల బదిలీ విషయంలో సీరియస్ గా ఉండకపోవడం వంటి కారణాలు బీజేపీని స్థానిక సంస్థల ఎన్నికల పదవులకు దూరం చేశాయన్న కామెంట్స్ వినపడుతున్నాయి. కేంద్ర నాయకత్వం కూడా రాష్ట్ర బీజేపీ నేతల పనితీరుపై అసంతృప్తిగా ఉన్నట్లు తెలిసింది. జాతీయ బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబిన్ ఏపీకి వచ్చి స్థానిక సంస్థల ఎన్నికల్లో బలంగా పోటీ చేసి నిలబడి పోరాడి విజయం సాధించి పార్టీని బలోపేతం చేయాలని విశాఖలో సూచించి వెళ్లినా రాష్ట్ర నేతలు ఏమాత్రం పట్టించుకోలేదన్న అభిప్రాయం బీజేపీ నేతల్లో వ్యక్తమవుతుంది. పట్టణ స్థానిక సంస్థలు, పరిషత్ ఎన్నికల్లో కూటమి విజయం సాధించినప్పటికీ, టీడీపీ 59, జనసేన 18 స్థానాలతో పోలిస్తే బీజేపీ కేవలం 4 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలను మాత్రమే గెలుచుకుంది.కీలక స్థానాల్లో ఓటమి చెందింది. అనంతపురం కార్పొరేషన్‌లో కూటమికి మెజారిటీ డివిజన్లు వచ్చినప్పటికీ, మేయర్ పదవికి పోటీ చేసిన బీజేపీ అభ్యర్థి వైసీపీ చేతిలో ఓటమి పాలయ్యారు. తిరుపతి కార్పొరేషన్, మంత్రి సత్యకుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న ధర్మవరం, అలాగే అల్లూరి సీతారామరాజు, విజయనగరం జిల్లాల బీజేపీ అధ్యక్షులు పోటీ చేసిన స్థానాల్లో కూడా పార్టీ అభ్యర్థులు పరాజయం పొందారు. దీన్ని బట్టి ఆంధ్రప్రదేశ్ లోని ఏ ప్రాంతంలోనూ బీజేపీ బలోపేతం కాలేదని, ఇక పరిస్థితి మారలేదన్న అభిప్రాయం బీజేపీ క్యాడర్ లోనూ, ద్వితీయ శ్రేణి నేతల్లోనూ వ్యక్తమవుతుంది. కూటమి పార్టీల మధ్య సమన్వయ లోపమే ప్రధాన కారణమని బీజేపీ నేతలు చెబుతున్నారు. , భీమవరం మున్సిపల్ ఎన్నికల్లో "కూటమి ధర్మాన్ని ఉల్లంఘించారని" ఆరోపిస్తూ బీజేపీ తన మిత్రపక్షాలైన టీడీపీ, జనసేనలతో విడిపోయింది. స్థానిక స్థాయిలో మిత్రపక్షాల మధ్య పూర్తిస్థాయి ఓట్ల బదిలీ మరియు సమన్వయం లేకపోవడం కొన్ని చోట్ల ప్రభావం చూపిందని విశ్లేషకులు భావిస్తున్నారు. గ్రామీణ స్థాయిలో బలహీనమైన క్యాడర్ ఉండటం కూడా ఓటములకు ప్రధాన కారణం. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ, జనసేనలతో పోలిస్తే బీజేపీ చెప్పుకోదగ్గ విజయాలను సాధించలేకపోయింది. క్షేత్రస్థాయిలో పార్టీ నిర్మాణం బలహీనంగా ఉండటంపై పార్టీ వర్గాల్లోనే అంతర్మథనం మొదలైనట్లు తెలుస్తోంది. యితే బీజేపీ నేతల వివరణ,వాదన మరోలా ఉన్నాయి. ఎన్నికల్లో తమ పార్టీ పూర్తిగా చతికిలపడిందన్న వాదనను బీజేపీ రాష్ట్ర నాయకత్వం తోసిపుచ్చుతోంది.కూటమి ఒప్పందంలో భాగంగా బీజేపీకి కేటాయించిన స్థానాల్లో 59 శాతానికి పైగా సీట్లను గెలుచుకున్నామని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని అనపర్తి , గోపాలపురం , కొవ్వూరు వంటి చోట్ల అత్యధిక స్థానాలు గెలిచామని ఆమె తెలిపారు. పోటీ చేసిన 33 జెడ్పీటీసీ స్థానాల్లో 23 గెలుచుకున్నామని, రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 355 మంది బీజేపీ ప్రతినిధులు ఎన్నికయ్యారని ఆయన వివరించారు. అయితే, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి కూటమి భాగస్వాముల మధ్య ఇంకా బలమైన సమన్వయం అవసరమని ఆయన అంగీకరించారు.మొత్తంగా చూస్తే, కూటమిలో భాగంగా బీజేపీకి తక్కువ సంఖ్యలో సీట్లు కేటాయించడం, కేటాయించిన కొన్ని కీలక మేయర్ మరియు కౌన్సిలర్ స్థానాల్లో మిత్రపక్షాల ఓట్లు పూర్తిగా బదిలీ కాకపోవడం, మరియు స్థానికంగా బలమైన నాయకత్వం లేకపోవడం వంటి అంశాలు బీజేపీ ఫలితాలపై ప్రభావం చూపాయని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

గుజరాత్‌లో వ్యాపారికి రూ.40 లక్షల నకిలీ నోట్లు ఇచ్చి మోసం

ఈ రాకెట్‌లో మరో ముగ్గురి ప్రమేయం ఉన్నట్లు పోలీసుల విచారణలో వెల్లడి నిందితుల నుంచి 17 నకిలీ నోట్ల కట్టలను స్వాధీనం చేసుకున్న పోలీసులు గుజరాత్‌లో ఓ వ్యాపారిని రూ.40 లక్షల మేర మోసం చేసిన ఘటనలో పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేశారు. నిజమైన నోట్ల కట్టలని నమ్మించి, 'చిల్డ్రన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' అని ముద్రించిన నకిలీ నోట్లను అంటగట్టి ఈ మోసానికి పాల్పడ్డారు. బాధితుడి కుటుంబం పక్కా ప్రణాళికతో పోలీసుల సహాయంతో నిందితులను పట్టుకుంది. ఈ వివరాలను పీటీఐ వార్తా సంస్థ తన కథనంలో వెల్లడించింది.ఘట్లోడియా పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్ ప్రకారం.. గాంధీనగర్‌కు చెందిన వ్యాపారి రికేన్ పటేల్ ఈ ఫిర్యాదు చేశారు. ఆయన మామ, ఉంఝాలో ట్రేడింగ్ సంస్థ నడుపుతున్న రోహిత్‌కుమార్ పటేల్‌కు నాగ్‌పూర్‌లోని ఓ వ్యాపార భాగస్వామి నుంచి రూ.40 లక్షలు రావాల్సి ఉంది. ఈ నగదును ఆన్‌లైన్ అంగడియా (సంప్రదాయ కొరియర్) సర్వీస్ ద్వారా పంపారు. అయితే, మంగళవారం అందిన 8 నోట్ల కట్టలను పరిశీలించగా, అవన్నీ నకిలీవని తేలింది. ఒక్కో కట్టలో రూ.5 లక్షలు ఉన్నాయని నమ్మించి మోసం చేశారు.దీంతో మోసపోయిన వ్యాపారి కుటుంబం, నిందితులను పట్టుకోవడానికి పోలీసుల సహాయంతో పక్కా ప్రణాళిక రచించింది. అహ్మదాబాద్‌లో మరోసారి నగదు డెలివరీకి ఏర్పాట్లు చేసింది. గురువారం అహ్మదాబాద్‌లోని పారస్‌నగర్ పెట్రోల్ పంప్ వద్దకు వచ్చిన ఢిల్లీకి చెందిన రాహుల్ సింగ్ ఠాకూర్ (23), రాజస్థాన్‌కు చెందిన మల్‌చంద్ శర్మ (30) నోట్ల కట్టలను చూపిస్తుండగా పోలీసులు వారిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఠాకూర్ వద్ద ఉన్న బ్యాగ్‌లో 17 నకిలీ నోట్ల కట్టలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటిలో 'చిల్డ్రన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా', 'భారతీయ మనోరంజన్ బ్యాంక్' అని రాసి ఉన్న 1,666 నకిలీ రూ.500 నోట్లు ఉన్నాయి. నిజమైనవని నమ్మించేందుకు ఐసీఐసీఐ బ్యాంక్ లేబుళ్లను కూడా అతికించారు. విచారణలో నోయిడాలో ఉంటున్న తన సోదరుడు గజానన్ శర్మ ద్వారా ధన్‌రాజ్ అనే వ్యక్తి పరిచయమయ్యాడని మల్‌చంద్ శర్మ పోలీసులకు తెలిపాడు. ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో వరుణ్ అనే వ్యక్తి నుంచి ఈ నకిలీ నోట్ల కట్టలను తీసుకుని అహ్మదాబాద్‌లో డెలివరీ చేయాలని ధన్‌రాజ్ తమకు సూచించినట్లు చెప్పాడు. ఈ పనికి తమకు ఒక్కొక్కరికి రూ.5,000 ఇస్తామని హామీ ఇచ్చారని నిందితులు ఒప్పుకున్నారు. ఈ ఘటనపై రాహుల్ సింగ్, మల్‌చంద్ శర్మ, గజానన్ శర్మ, ధన్‌రాజ్, వరుణ్‌లపై 'భారతీయ న్యాయ సంహిత' (బీఎన్ఎస్) కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ రాకెట్ వెనుక ఉన్న పూర్తి నెట్‌వర్క్‌పై దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

గొల్లపల్లిలో మూడు ఆలయాల్లో చోరీ...

రాజన్న సిరిసిల్ల ,ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లిలో తెల్లవారుజామున దొంగలు హల్‌చల్ చేశారు. పురాతన శివాలయం, శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం, గాలం గుట్ట ఆంజనేయస్వామి ఆలయాల్లో హుండీలను ధ్వంసం చేసి నగదును అపహరించారు.శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ హుండీని బయటకు తీసుకొచ్చి పగులగొట్టగా, మిగతా రెండు ఆలయాల్లోనూ హుండీల్లోని నగదును దొంగిలించారు. ఉదయం విషయం తెలుసుకున్న గ్రామస్తులు సర్పంచ్ కొండ రమేష్ గౌడ్‌కు సమాచారం అందించారు.పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆలయాలు, గ్రామపంచాయతీ కార్యాలయంలోని సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలించారు. వాటి ఆధారంగా ఓ అనుమానితుడిని గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం. చోరీకి గురైన నగదు ఎంత...?

యూపీలో మారుతున్న సమీకరణాలు...



లక్నో, ఉత్తరప్రదేశ్ ఓటర్లలో బ్రాహ్మణుల సుమారు 10 నుంచి 12 శాతం వరకు ఉంటారు. రాష్ట్రంలోని 403 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 100కు పైగా స్థానాల్లో వీరు గెలుపోటములను ప్రభావితం చేయగలరు. పరిపాలనలో ఠాకూర్ల ఆధిపత్యం ఎక్కువగా ఉందన్న భావనతో యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వంపై బ్రాహ్మణుల్లో అసంతృప్తి ఉందనే వార్తలు తరచూ వస్తున్నాయి. ప్రతిపాదిత యూజీసీ నిబంధనల వంటి వివాదాలు కూడా అగ్రవర్ణాల రాజకీయ చర్చలకు ఆజ్యం పోశాయి.సంప్రదాయకంగా వెనుకబడిన తరగతులు (పిచాడ్), దళితులు, మైనారిటీలను (అల్పసంఖ్యాక్) తన 'పీడీఏ' ఫార్ములా ద్వారా ఏకం చేయడానికి ప్రయత్నిస్తున్న ఎస్పీ.. ఇప్పుడు తమ విస్తృత సామాజిక కూటమిలో బ్రాహ్మణులకు కూడా చోటు ఉందని సంకేతాలు ఇస్తోంది.ఆగస్టు 5, 2026న లక్నోలో సోషలిస్ట్ నేత జనేశ్వర్ మిశ్రా జయంతి సందర్భంగా జరిగిన ఒక కార్యక్రమంలో అఖిలేష్ యాదవ్ మాట్లాడుతూ.. పీడీఏ లోని 'ఖ' అంటే కేవలం పిచ్డా (వెనుకబడిన వర్గాలు) మాత్రమే కాదు, 'పండిట్' (బ్రాహ్మణులు) కూడా అని వ్యాఖ్యానించారు అఖిలేష్ పర్యటన వెనుక రాజకీయ సంకేతాలు చాలా స్పష్టంగా ఉన్నాయి. దశాబ్దాల పాటు 'తివారీ హాతా' కేవలం ఒక కుటుంబ నివాసంగానే కాకుండా, పూర్వాంచల్‌లో చరిత్రాత్మక బ్రాహ్మణ– ఠాకూర్ ఆధిపత్య పోరులో బ్రాహ్మణ వర్గానికి ప్రతినిధిగా, ఒక బలమైన రాజకీయ శక్తి కేంద్రంగా వెలుగొందింది. 2023లో మరణించిన హరిశంకర్ తివారీ దాదాపు నాలుగు దశాబ్దాల పాటు అప్రతిహత రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగించారు. ఆయన పలుకుబడి ఎంతలా ఉండేదంటే కళ్యాణ్ సింగ్, రాజ్‌నాథ్ సింగ్ నుంచి ములాయం సింగ్ యాదవ్, మాయావతి వరకు ఉత్తరప్రదేశ్‌ను పాలించిన ముఖ్యమంత్రులందరూ తమ మంత్రివర్గాల్లో ఆయనకు స్థానం కల్పించారు.తివారీ మరణానంతరం ఆయన కుమారులు వినయ్ శంకర్ తివారీ, మాజీ ఎంపీ భీష్మ శంకర్ తివారీలు ఆయన రాజకీయ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు, కానీ, వారి ప్రభావం మునుపటి కంటే గణనీయంగా తగ్గింది. 1985 నుంచి 2007 మధ్య గోరఖ్‌పూర్‌లోని చిల్లుపార్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి హరిశంకర్ తివారీ ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆయన తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో 2007, 2012 ఎన్నికల్లో మాత్రమే ఆయన ఓడిపోయారు. ఆ తర్వాత మళ్లీ ఎన్నికల్లో పోటీ చేయలేదు. ఆయన కుమారుడు వినయ్ శంకర్ 2017లో ఇక్కడి నుంచి గెలిచినప్పటికీ, 2022లో బీజేపీ అభ్యర్థి రాజేష్ త్రిపాఠి చేతిలో ఓటమి పాలయ్యారు.మాయావతి నాయకత్వంలోని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ)తో కొంతకాలం సాగిన ప్రయాణం తర్వాత, గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు 2021లో తివారీ కుటుంబం ఎస్పీలో చేరింది.1980వ దశకంలో తూర్పు ఉత్తరప్రదేశ్‌లో మాఫియా–రాజకీయ బంధాలు బలపడుతున్న సమయంలోనే హరిశంకర్ తివారీ ఎదుగుదల మొదలైంది. విద్యార్థి రాజకీయాలతో తన ప్రస్థానాన్ని ప్రారంభించి, ఆ తర్వాత ప్రభుత్వ కాంట్రాక్టుల రంగంలోకి అడుగుపెట్టిన ఆయన; ధనం, కండబలం, రాజకీయ పలుకుబడితో ఈ ప్రాంతంలో తిరుగులేని బ్రాహ్మణ నేతగా ఎదిగారు. 1985లో జైలులో ఉంటూనే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి తొలిసారి అసెంబ్లీకి ఎన్నికై సంచలనం సృష్టించారు. పూర్వాంచల్ రాజకీయాల్లో అత్యంత శక్తివంతమైన వ్యక్తిగా ఆయన ఎదగడానికి ఇదే నాంది పలికింది.'హాతా'గా పిలిచే గోరఖ్‌పూర్‌లోని ఆయన నివాసం అనతికాలంలోనే ఒక రాజకీయ కేంద్రబిందువుగా మారింది. దాని ప్రభావం జిల్లా సరిహద్దులు దాటి విస్తరించింది. తివారీ కుటుంబానికి మరో బలమైన గ్యాంగ్‌స్టర్ వీరేంద్ర ప్రతాప్ షాహీతో దీర్ఘకాలిక వైరం ఉండేది. షాహీ నివాసాన్ని 'శక్తి సదన్' అని పిలిచేవారు. 'హాతా ఎబ శక్తి సదన్' వైరం తూర్పు యూపీ రాజకీయ చరిత్రలో ఒక భాగమైపోయింది. ఈ ప్రాంతంలో పాతుకుపోయిన బ్రాహ్మణ– ఠాకూర్ విభజన కోణంలోనే దీనిని చూసేవారు. 1990వ దశకం చివరలో షాహీ హత్య తర్వాత అధికార సమీకరణాలు మారిపోయాయి. ఇది పూర్వాంచల్ రాజకీయాల్లో తివారీ కుటుంబ స్థానాన్ని మరింత సుస్థిరం చేసింది.కాలక్రమేణా 'శక్తి సదన్ ఎబ హాతా' వైరం కాస్తా 'మఠం ఎబ హాతా' అనే కొత్త రాజకీయ రూపాన్ని సంతరించుకుంది. యోగి ఆదిత్యనాథ్‌తో ముడిపడి ఉన్న గోరఖ్‌నాథ్ మఠం.. ఈ ప్రాంతంలో ఠాకూర్ సామాజిక వర్గ రాజకీయ ప్రాబల్యానికి చిహ్నంగా నిలిచింది. ఫలితంగా బ్రాహ్మణ–ఠాకూర్ విభజన తూర్పు యూపీ రాజకీయాల్లో ఒక అంతర్లీన అంశంగా మారింది.హరిశంకర్ తివారీపై దోపిడీ, హత్య, కిడ్నాప్, ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించడం వంటి రెండు డజన్లకు పైగా క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. అయితే, ఏ ఒక్క కేసులోనూ ఆయనకు శిక్ష పడలేదు. ఆయన రాజకీయ పలుకుబడి, 'హాతా' చుట్టూ అల్లుకున్న ఆకర్షణ ఆయన ప్రజా జీవితంలో కీలకంగా మారాయి.యోగి ఆదిత్యనాథ్, తివారీ కుటుంబం మధ్య సంబంధాలు ఎప్పుడూ ఉద్రిక్తంగానే ఉన్నాయి. యోగి ప్రభుత్వం బ్రాహ్మణుల కంటే ఠాకూర్లకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోందన్న ఆరోపణలు యూపీ రాజకీయాల్లో తరచూ వినిపిస్తుంటాయి. యోగి ఆదిత్యనాథ్ ముఖ్యమంత్రి అయిన వెంటనే పోలీసులు 'తివారీ హాతా'పై దాడి చేయడంతో ఈ వాదనకు మరింత బలం చేకూరింది. ఒక నేరస్థుడు లోపల దాక్కున్నాడనే కారణంతో పోలీసులు ఆ దాడి చేశారు. అయితే, పోలీసులు వెతుకుతున్న ఆ వ్యక్తి అప్పటికేమూడు నెలలుగా బల్లియా జైలులో ఉన్నాడని తర్వాత తేలింది. దశాబ్దాల పాటు పోలీసులు అడుగుపెట్టడానికి కూడా సాహసించని 'హాతా'పై జరిగిన ఈ దాడి అప్పట్లో సంచలనంగా మారింది.గోరఖ్‌నాథ్ మఠం, తివారీ కుటుంబం మధ్య ఏర్పడిన ఈ విభేదాలు నేటికీ కొనసాగుతున్నాయి. ఇరు వర్గాలు రాజకీయంగా ఎడమొహం పెడమొహంగానే ఉన్నాయి; సయోధ్య దిశగా ఎలాంటి ప్రయత్నాలు కనిపించలేదు. ఇటీవల హరిశంకర్ తివారీ స్వగ్రామంలో ఆయన విగ్రహ ఏర్పాటు కోసం నిర్మించిన వేదికను కూల్చివేయడం పాత విభేదాలను మళ్లీ తెరపైకి తెచ్చింది. ఈ వివాదాన్ని అందిపుచ్చుకున్న సమాజ్‌వాదీ పార్టీ, ఈ ప్రాంతంలోని బ్రాహ్మణుల సెంటిమెంట్‌ను తనకు అనుకూలంగా మార్చుకోవడానికి ప్రయత్నిస్తోంది.తమ సంప్రదాయ ఓటు బ్యాంకును దాటి బ్రాహ్మణ ఓట్లలోకి చొచ్చుకుపోవాలని ఎస్పీ భావిస్తోందనడానికి ఇది స్పష్టమైన నిదర్శనం.తివారీ హాతాలో అఖిలేష్ యాదవ్ పర్యటన ఈ పెద్ద రాజకీయ వ్యూహంలో భాగమే. పూర్వాంచల్‌లో అత్యంత గుర్తింపు పొందిన బ్రాహ్మణ నేత కుటుంబానికి చేరువవ్వడం ద్వారా, పాత రాజకీయ విభేదాలను తిరిగి రాజేసి, దానిని ఎన్నికల అవకాశంగా మలుచుకోవాలని ఎస్పీ అధినేత ప్రయత్నిస్తున్నారు.రాజకీయాలపై 'హాతా', 'గోరఖ్‌నాథ్ మఠం' ప్రభావం ఇంకా బలంగా ఉన్న ఈ ప్రాంతంలో, అఖిలేష్ పర్యటన కేవలం ఒక రాజకీయ వారసత్వానికి నివాళులర్పించడం మాత్రమే కాదు; రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు ముందు బ్రాహ్మణులకు పంపిన ఒక పక్కా ప్రణాళికాబద్ధమైన సందేశం.

కదులుతున్న నకిలీ ఉద్యోగాల దందా...



గుంటూరు, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో గత కొద్ది రోజులుగా సంచలనం సృష్టిస్తున్న రూ. 7 కోట్ల నకిలీ ఉద్యోగాల స్కాం వెనుక అసలు నిజాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. విజయవాడకు చెందిన బోడపాటి ధరణి కృష్ణ అనే మహిళ, మంగళగిరిలోని కైరెన్ కన్సల్టెన్సీ సర్వీసెస్ లో ఉద్యోగినిగా పనిచేస్తూ, పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, జనసేన ప్రోగ్రామ్ కమిటీ చైర్మన్ కల్యాణం శివ శ్రీనివాసరావు తనకు స్వయానా బాబాయి అని నిరుద్యోగులను నమ్మించింది. పోలీసు, దేవాదాయ శాఖల్లో ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఏలూరు జిల్లాకు చెందిన 16 మంది, తణుకుకు చెందిన 20 మంది మొత్తం 36 మంది నిరుద్యోగుల నుంచి సుమారు రూ. 7 కోట్ల వరకు వసూలు చేసినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. బాధితులకు అనుమానం రాకుండా ఉండేందుకు శివ శ్రీనివాసరావు ఫోటోతో నకిలీ వాట్సాప్ ప్రొఫైల్ సృష్టించి, ఫేక్ ఆడియో కాల్స్ మాట్లాడించడమే కాకుండా, ప్రభుత్వ ముద్రలు, అధికారుల సంతకాలతో కూడిన నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్లు, కైరెన్ కన్సల్టెన్సీ పేరుతో తప్పుడు రిఫండ్ బిల్లులను సైతం ఆమె తయారు చేసినట్లు వెల్లడైంది.నెలలు గడుస్తున్నా ఉద్యోగాలు రాకపోవడంతో అనుమానం వచ్చిన ఏలూరుకు చెందిన తరుణ్ అనే బాధితుడు నవంబర్ 5న నేరుగా కల్యాణం శివ శ్రీనివాసరావును కలిసి నిలదీయడంతో ఈ ఘరానా మోసం బట్టబయలైంది. తాను చూపించిన నకిలీ పత్రాలు, వాట్సాప్ చాటింగ్ చూసి విస్తుపోయిన శివ శ్రీనివాసరావు వెంటనే కైరెన్ కన్సల్టెన్సీ సీఈవో, జనసేన నాయకురాలు కోట రుక్మిణిని అప్రమత్తం చేశారు. దీంతో నవంబర్ 9న సంస్థ తరఫున ధరణి కృష్ణకు షోకాజ్ నోటీసు జారీ చేయగా, నిమ్మకాయల పెద్దిరాజు అనే వ్యక్తి ప్రోద్బలంతోనే తాను మధ్యవర్తిగా వ్యవహరించి ఈ వసూళ్లకు పాల్పడినట్లు ఆమె లిఖితపూర్వకంగా అంగీకరించింది. వెంటనే ఆమెను ఉద్యోగం నుంచి తొలగించిన కోట రుక్మిణి , శివ శ్రీనివాసరావు వేర్వేరుగా మంగళగిరి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ధరణి కృష్ణ అరెస్టు కాగా, తాజాగా ఏపీ సీఐడీ పోలీసులు ఈ కేసులో రెండో ప్రధాన నిందితుడు నిమ్మకాయల పెద్దిరాజును హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకోవడం కీలక మలుపుగా మారింది.అయితే, ఈ వ్యవహారం కాస్తా సోషల్ మీడియా , వైసీపీ అనుకూల మీడియా వేదికల ప్రవేశంతో ఒక్కసారిగా రాజకీయ రంగు పులుముకుంది. ఒకవైపు నిందితురాలు ధరణి కృష్ణ తల్లి నాగమణి తన కుమార్తెను అక్రమంగా నిర్బంధించారని హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేస్తూనే, కన్సల్టెన్సీ డైరెక్టర్ కోట రుక్మిణి పాత్రపైనా అనుమానాలు వ్యక్తం చేశారు. ఇదే అదునుగా ప్రతిపక్ష వైసీపీ నేతలు, సాక్షి మీడియా ఛానళ్లు జనసేన కార్యాలయం పేరుతో రూ. 7 కోట్ల స్కాం అంటూ కథనాలు ప్రసారం చేస్తూ, నేరుగా కోట రుక్మిణిని , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను ఈ వివాదంలోకి లాగే ప్రయత్నం చేశాయి.ఈ క్రమంలోనే తీవ్ర వ్యక్తిత్వ హననానికి గురైన జనసేన నాయకురాలు కోట రుక్మిణి తాజాగా మౌనం వీడుతూ ఘాటైన ప్రకటన విడుదల చేశారు. యనమల నాగార్జున యాదవ్ చేసిన ఈ ఆరోపణలలో ఎలాంటి వాస్తవం లేదని, కేవలం పవన్ కల్యాణ్ వ్యక్తిత్వాన్ని, జనసేన ప్రతిష్టను దెబ్బతీసేందుకే వైసీపీ ఈ తరహా బురద చల్లుడు రాజకీయాలకు తెరలేపిందని జనసేన నాయకులు తీవ్రంగా మండిపడుతున్నారు. ఎఫ్ఐఆర్ కాపీల వివరాలు, పోలీసుల దర్యాప్తు ప్రాథమిక దశలోనే ఉండగానే, ఎలాంటి ధృవీకరణ లేని పత్రాలను పట్టుకుని వైసీపీ నేతలు, ఆ పార్టీ అనుబంధ మీడియా కట్టుకథలు అల్లుతున్నాయని జనసేన వర్గాలు కౌంటర్ ఇస్తున్నాయి. ముఖ్యంగా కోట రుక్మిణి గతంలో లండన్‌లో నిర్వహించిన వ్యాపారాలను ప్రస్తుత వివాదానికి ముడిపెట్టి, మనీ లాండరింగ్ జరిగిందంటూ నిరాధారమైన వాదనలు తెరపైకి తేవడం వైసీపీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని జనసేన శ్రేణులు విమర్శిస్తున్నాయి.వాస్తవానికి, ఈ వివాదానికి సంబంధించి మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో నవంబర్ 11న రెండు వేర్వేరు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కళ్యాణం శివశ్రీనివాస్, కోట రుక్మిణి స్వయంగా పోలీసులకు ఫిర్యాదు చేస్తూ.. తమ వద్ద పనిచేసే ధరణి అనే మహిళ తమకు తెలియకుండానే తమ పేర్లు, సంస్థ పేరును దుర్వినియోగం చేసి ఉద్యోగాల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడిందని పేర్కొన్నారు. అంటే, మోసం జరిగినట్లు గుర్తించి బాధితుల పక్షాన నిలబడి స్వయంగా పోలీసులకు ఫిర్యాదు చేసిందే జనసేన నేతలు కాగా, ఇప్పుడు ఆ కేసునే తిప్పి వారిపైనే ఆరోపణలు చేయడం వైసీపీ ద్వంద్వ వైఖరికి అద్దం పడుతోందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.వైసీపీ నేతలు మాత్రం తమ వాదనను సమర్థించుకుంటూ ఈ వ్యవహారంపై సీబీఐ లేదా హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు. ధరణి కృష్ణను పోలీసులు అక్రమంగా నిర్బంధించి చిత్రహింసలకు గురిచేశారని, ఆమె తల్లి హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ వేయడంతోనే వదిలేశారని యనమల నాగార్జున ఆరోపించారు. దీనికి ప్రతిగా, వైసీపీ నాయకులు ఏ ఆధారాలతో లండన్ లింకులు, రూ. 7 కోట్ల మనీ లాండరింగ్ ఆరోపణలు చేస్తున్నారో బహిర్గతం చేయాలని, విచారణలో ఉన్న అంశాలపై తప్పుడు ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని జనసేన నేతలు హెచ్చరిస్తున్నారు. ఇటీవలి పరిణామాల నేపథ్యంలో కోట రుక్మిణి పేరును సోషల్ మీడియాలో, రాజకీయ వేదికలపైకి లాగడం ద్వారా పవన్ కల్యాణ్‌ను లక్ష్యంగా చేసుకోవాలన్న వైసీపీ వ్యూహం ఏపీ రాజకీయాల్లో కొత్త రగడకు దారితీసింది. ఫిర్యాదు చేసిన వారిపైనే తిరిగి ఆరోపణలు చేస్తూ వైసీపీ అనుబంధ మీడియా ప్రచారం సాగిస్తుండగా, వాస్తవాలు పోలీసు విచారణలో బయటకు వస్తాయని, అప్పటివరకు ఇలాంటి నిరాధార ఆరోపణలను ప్రజలు నమ్మరని కూటమి నేతలు స్పష్టం చేస్తున్నారు.

మూడో కంటిలో నేరగాళ్లు

విజయవాడ, సైబర్ నేరగాళ్లు ఎక్కువగా జార్ఖండ్, రాజస్థాన్, హర్యాణా వంటి ఇతర రాష్ట్రాల నుంచి నకిలీ సిమ్ కార్డులు, మ్యూల్ బ్యాంక్ ఖాతాలను ఉపయోగిస్తూ దర్యాప్తు సంస్థలకు చిక్కకుండా నేరాలకు పాల్పడుతుంటారు. ఇలా రాష్ట్ర సరిహద్దులు దాటి జరుగుతున్న మోసాలను అరికట్టడంలో "త్రినేత్ర" యాప్ ఒక వారధిలా పని చేస్తోంది. ఈ యాప్ ద్వారా రాష్ట్రంలోని అన్ని జిల్లాల పోలీస్ స్టేషన్లు, ప్రత్యేక సైబర్ క్రైమ్ యూనిట్లు ఒకే డిజిటల్ వేదికపై అనుసంధానమై ఎప్పటికప్పుడు సమాచారాన్ని పంచుకునే వీలు కలుగుతుంది.రోజురోజుకూ రాష్ట్రంలో సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు పెరుగుతున్నాయి. ఈ సైబర్ క్రైమ్‌కు అడ్డుకట్ట వేసేందుకు ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ సాంకేతిక అస్త్రాలను రెడీ చేస్తోంది. ఇప్పటికే కృష్ణా జిల్లాలో విజయవంతంగా పనిచేస్తూ నేర నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తున్న "త్రినేత్ర" యాప్‌ను ఇకపై రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా నిర్ణయం తీసుకున్నారు.ప్రతి జిల్లాలో 20 మంది నిపుణులైన సిబ్బందితో ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు డీజీపీ వెల్లడించారు. ఈ టీమ్‌ల ద్వారా సోషల్ మీడియా స్కామ్‌లు, ఆన్‌లైన్ ఆర్థిక మోసాలు, ఫిషింగ్, ఓటీపీ మోసాలతో పాటు కలకలం రేపుతున్న "డిజిటల్ అరెస్ట్" వంటి కేసుల దర్యాప్తును వేగవంతం చేయనున్నారు. ఈ టీమ్‌లు స్థానిక పోలీస్ స్టేషన్లకు సాంకేతిక సహకారం అందిస్తూ నేరగాళ్ల ఆటకట్టించనున్నాయి.సైబర్ నేరాల నియంత్రణకు "త్రినేత్ర" యాప్ ప్రధాన లక్ష్యమైనప్పటికీ, సాధారణ నేరాలను ముందుగానే పసిగట్టి నిరోధించడంలోను కూడా ఇది సమర్థవంతంగా పని చేస్తుంది. కమాండ్

రంగంలోకి దిగిన ఏఐసీసీ...



హైదరాబాద్, నవంబరు 23,తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత క్రమశిక్షణ ఉల్లంఘనలపై అధిష్టానం దృష్టి సారించినట్లు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్,నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి ప్రకటించారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి పార్టీ లక్ష్మణ రేఖను దాటి మాట్లాడినట్లు వచ్చిన ఫిర్యాదులను తాను టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు వివరించానని, ఆయన ఆ విషయాన్ని అఖిల భారత కాంగ్రెస్ కమిటీ దృష్టికి తీసుకెళ్లారని మల్లు రవి పేర్కొన్నారు. ఇటీవల ప్రభుత్వ విధానాలు, నాయకత్వంపై వీరు చేసిన బహిరంగ వ్యాఖ్యలు పార్టీ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారాయి.అయితే, తెలంగాణ కాంగ్రెస్ నూతన వ్యవహారాల ఇంచార్జ్‌గా బి.ఎం. సందీప్ ఇప్పుడే బాధ్యతలు స్వీకరించినందున, అధిష్టానం తక్షణమే కఠిన చర్యలకు ఉపక్రమించకపోవచ్చని అభిప్రాయపడుతున్నారు. కొత్తగా వచ్చిన ఇంచార్జ్ రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులు, నేతల మధ్య ఉన్న సమీకరణాలు , అసంతృప్తికి గల కారణాలను పూర్తిస్థాయిలో అధ్యయనం చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశాలతో పాటు, అసమ్మతి వ్యక్తం చేస్తున్న నేతలతో నేరుగా మాట్లాడి అభిప్రాయాలు సేకరించేందుకే అధిష్టానం ప్రాధాన్యత ఇస్తున్నట్లు పార్టీ వర్గాల సమాచారం.తక్షణమే వేటు వేయడం వంటి నిర్ణయాలు తీసుకోకపోయినప్పటికీ, భవిష్యత్తులో ఎవరైనా మరోసారి గీత దాటి బహిరంగ విమర్శలకు దిగితే మాత్రం ఉపేక్షించేది లేదన్న బలమైన సంకేతాలను ఏఐసీసీ పంపించనుందని పరిశీలకులు భావిస్తున్నారు.పార్టీలో అంతర్గత సమస్యలు లేదా అభిప్రాయ భేదాలు ఏవైనా ఉంటే వాటిని పార్టీ వేదికలపైనే చర్చించాలని, బహిరంగ వేదికలపై మాట్లాడటం వల్ల ప్రతిపక్షాలకు ఆయుధాలు ఇచ్చినట్లవుతుందని పీసీసీ నాయకత్వం స్పష్టం చేస్తోంది. క్రమశిక్షణ ముందు అందరూ సమానమేనని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సైతం ఇటీవల వ్యాఖ్యానించారు.మొత్తంగా చూస్తే, కొత్త ఇంచార్జ్ రాకతో తెలంగాణ కాంగ్రెస్‌లో క్రమశిక్షణ గాడిలో పెట్టే ప్రక్రియ మొదలైందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ముందుగా నేతలకు నచ్చజెప్పడం, హెచ్చరికలు జారీ చేయడం ద్వారా పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేస్తూనే,నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్న స్పష్టమైన సందేశాన్ని అధిష్టానం ఇవ్వబోతోందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

రంగంలోకి సందీప్

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నూతన వ్యవహారాల ఇంచార్జ్‌గా నియమితులైన బీఎంసీ సందీప్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ ముఖ్య నేతలతో కీలక సమావేశం నిర్వహించారు. గతంలో ఇంచార్జ్‌గా పనిచేసిన మీనాక్షి నటరాజన్ స్థానంలో బాధ్యతలు చేపట్టిన ఆయన, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మరింత బలోపేతం చేయడానికి నాయకులంతా సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన నిజమైన కార్యకర్తలకు నామినేటెడ్ పదవులు, పార్టీ పదవుల్లో తగిన గుర్తింపు లభిస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. అంతర్గత విభేదాలకు తావులేకుండా, అధిష్టానం ఆదేశాల మేరకు క్రమశిక్షణతో ముందుకు సాగాలని నాయకులకు దిశానిర్దేశం చేశారు.ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న విమర్శలను సమర్థవంతంగా తిప్పికొట్టడంతో పాటు, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. నూతన ఇంచార్జ్ రాక సందర్భంగా గాంధీభవన్‌కు నేతలు పోటెత్తారు.

బండి సంజయ్ టార్గెట్ నెరవేరుతుందా? అసలు గురి 2028 ఎన్నికలేనా?

హైదరాబాద్,తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక ఘట్టానికి కరీంనగర్ గడ్డ సిద్ధమవుతోంది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ పర్యటనను కేవలం ఒక సాధారణ పార్టీ కార్యక్రమంగా కాకుండా రాష్ట్రంలో తమ రాజకీయ సత్తా చాటే వేదికగా మార్చుకోవాలని కాషాయ దళం భావిస్తోంది. ఈ సభకు ఏకంగా లక్ష మందిని సమీకరించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ నిర్దేశించుకున్నారు. ఈ భారీ జనసమీకరణ వెనుక పెద్ద వ్యూహమే ఉన్నట్టు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.నవంబర్ 23న బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ కరీంనగర్ పర్యటన నేపథ్యంలో నిర్వహించనున్న భారీ పాదయాత్ర.. బహిరంగ సభను కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నట్లు పార్టీ శ్రేణులు పేర్కొంటున్నాయి. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని గ్రామాలు, పట్టణాలు, మండలాల నుంచి సుమారు లక్ష మందిని సమీకరించేలా ప్రణాళికలు రచిస్తున్నట్లు సమాచారం. కేవలం ముఖ్య నాయకులు.. కార్యకర్తలకే పరిమితం కాకుండా.. పోలింగ్ బూత్ స్థాయి నుంచి జనసమీకరణ జరగాలని బండి సంజయ్ ఆదేశించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల నాయకులు, నగర మేయర్, డిప్యూటీ మేయర్‌తో పాటు ఇతర కీలక నేతలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ఎవరి బాధ్యతలను వారికి అప్పగించారు.ఇటీవల హైదరాబాద్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పాల్గొన్న 'లోక్‌తంత్ర బచావో.. అరాజకతా హటావో' కార్యక్రమానికి సుమారు లక్ష మంది హాజరై విజయవంతమైనట్లు బీజేపీ నాయకులు భావిస్తున్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై ప్రతిపక్ష ఇండియా కూటమి చేస్తున్న విమర్శలకు దీటుగా బదులివ్వడం.. రాజ్యాంగ వ్యవస్థలపై జరుగుతున్న దాడులంటూ బీజేపీ ఆరోపిస్తున్న అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ఆ సభ ప్రధాన ఉద్దేశంగా నిలిచింది. ఇప్పుడు అదే తరహాలో కరీంనగర్‌లోనూ జనసమీకరణ జరిపితే రాష్ట్రవ్యాప్తంగా పార్టీకి బలమైన కేడర్ ఉందనే సంకేతాన్ని పంపవచ్చని బండి సంజయ్ ప్లాన్ చేసినట్టు తెలుస్తోంది.నవంబర్ 23న ఉదయం 11 గంటలకు హైదరాబాద్ చేరుకోనున్న నితిన్ నబీన్.. అక్కడి నుంచి హెలికాప్టర్ ద్వారా మధ్యాహ్నం 12 గంటల సమయంలో కరీంనగర్ కలెక్టరేట్ హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. జాతీయ అధ్యక్షుడి రాక కంటే కూడా ఆయనకు లభించే స్వాగతం.. తరలివచ్చే జనసందోహం, పార్టీ శ్రేణుల మధ్య సమన్వయం ఎలా ఉంటుందనే దానిపై ఆసక్తి నెలకొంది. ఈ కార్యక్రమ నిర్వహణ బాధ్యతలు ప్రధానంగా బండి సంజయ్‌పైనే ఉండటంతో లక్ష మందిని సమీకరించడం ఆయనకు ఒక కీలక సవాలుగా మారింది. అనుకున్న స్థాయిలో జనసమీకరణ జరిగితే రాష్ట్ర బీజేపీలో ఆయన రాజకీయ పలుకుబడి మరింత బలపడే అవకాశం ఉందనే చర్చ నడుస్తోంది. ఈ కార్యక్రమాన్ని కేవలం జాతీయ అధ్యక్షుడికి స్వాగతం పలికే వేదికగా మాత్రమే చూడకుండా 2028 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార పోటీకి సన్నద్ధంగా క్షేత్రస్థాయిలో బలం పెంచుకునే పనిగా బీజేపీ భావిస్తున్నట్లు తెలుస్తోంది.నవంబర్ 23న కరీంనగర్ వేదికగా జరగనున్న ఈ సభ రాబోయే ఎన్నికల వ్యూహాలకు ఒక దిక్సూచిగా మారనుందా? లేక బండి సంజయ్ నిర్దేశించుకున్న లక్ష్యం ఏ మేరకు నెరవేరుతుందా? అనేది తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.



గ్రామస్థాయిలో దారి తప్పిన కూటమి సమన్వయం !

అమరావతి,ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల పోరులో భాగంగా గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విడిగా పోటీ చేసేందుకు జనసేన పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. మున్సిపల్, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల తరహాలో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు , స్థానాల పంపకాలు ఉండవని, పార్టీ నాయకులు, జనసైనికులు, వీర మహిళలు ఎవరైనా ఎలాంటి రాజకీయ అడ్డంకులు లేకుండా స్వేచ్ఛగా నామినేషన్లు దాఖలు చేయవచ్చని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆదివారం అధికారికంగా ప్రకటించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు రాజకీయ పార్టీలకు అతీతంగా, స్థానిక సంస్థలను బలోపేతం చేసే లక్ష్యంతో జరిగేవని జనసేన నాయకత్వం పైకి చెబుతున్నప్పటికీ, దీని వెనుక క్షేత్రస్థాయి రాజకీయ సమీకరణాలు, క్యాడర్ ఒత్తిడి స్పష్టంగా కనిపిస్తున్నాయి.

పార్టీ పరంగా జరిగిన ఎన్నికల్లో కూటమి విజయం

నిజానికి, ఇటీవల జరిగిన మున్సిపాలిటీలు, పరిషత్ ఎన్నికల వరకు టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి పొత్తు విజయవంతంగానే పనిచేసి, మెజారిటీ స్థానాలను కైవసం చేసుకుంది. అయితే, గ్రామస్థాయికి వచ్చేసరికి కూటమి పార్టీల మధ్య సర్దుబాటు సాధ్యం కాదని తేలిపోయింది. మున్సిపల్, పరిషత్ ఎన్నికల సమయంలోనే కొన్ని స్థానాల్లో తమకు అన్యాయం జరిగిందని, టీడీపీ గ్రామ , మండల స్థాయి నేతలు తమ డిమాండ్లను పట్టించుకోవడం లేదని జనసేన కార్యకర్తలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.గ్రామాల్లో బలంగా ఉన్న జనసైనికులకు సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేసే అవకాశాలు దక్కకపోతే పార్టీ బలహీనపడే ప్రమాదం ఉందని గుర్తించిన పవన్ కళ్యాణ్, కార్యకర్తల మనోభావాలను గౌరవిస్తూ వారికి ఫ్రీ హ్యాండ్ ఇచ్చారనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

బీజేపీలోనూ కనిపించని అసంతృప్తి

మరోవైపు, కూటమిలోని మూడో భాగస్వామి అయిన బీజేపీలోనూ స్థానిక ఎన్నికల ఫలితాలు, పదవుల పంపకాల విషయంలో తీవ్ర అసంతృప్తి నెలకొంది. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో అనంతపురం కార్పొరేషన్‌తో పాటు కొన్ని మున్సిపల్ స్థానాల్లో కూటమి పార్టీల మధ్య సమన్వయ లోపం వల్లే తమ అభ్యర్థులు



ఓడిపోయారని, జడ్పీ ఛైర్మన్లు , కీలక పదవుల విషయంలో తమకు తగిన ప్రాధాన్యత దక్కడం లేదని బీజేపీ శ్రేణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. భీమవరం వంటి చోట్ల కూటమి ధర్మాన్ని ఉల్లంఘించారంటూ బీజేపీ నేతలు బహిరంగంగానే అసమ్మతి గళం వినిపించిన పరిస్థితి కనిపించింది. ఆది నారాయణ రెడ్డి రాజీనామా ప్రకటన ఈ అసంతృప్తిని మరింత పెంచింది.

గ్రామస్థాయి నేతలు పెద్దల మాట వినరు!

ఇటీవల జరిగిన ఉమ్మడి మీడియా సమావేశంలో సైతం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, జనసేన మంత్రి నాదెండ్ల మనోహర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ స్థానిక ఎన్నికల్లో కొన్ని చోట్ల కూటమి పార్టీల మధ్య స్వల్ప సమన్వయ లోపాలు తలెత్తాయని అంగీకరించారు. పైస్థాయిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ అగ్రనేతల మధ్య అద్భుతమైన అవగాహన ఉన్నప్పటికీ, కిందిస్థాయి కార్యకర్తలు , గ్రామ నాయకుల మధ్య ఆ స్థాయి సమన్వయం ఇంకా పూర్తిస్థాయిలో రాలేదని తాజా పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. రెండు విడతల పంచాయతీ ఎన్నికల నామినేషన్ల గడువు ముగిసిన తర్వాత జనసేన నుంచి ఈ ప్రకటన రావడంపై సోషల్ మీడియాలో భిన్న స్పందనలు వ్యక్తమవుతున్నప్పటికీ, రాబోయే విడతల్లో గ్రామాల్లో పోటీ మరింత ఆసక్తికరంగా మారనుంది. పార్టీ గుర్తులు లేని ఎన్నికలు కావడంతో కూటమి పార్టీల మద్దతుదారులు స్నేహపూర్వక పోటీ పేరుతో బరిలోకి దిగితే, ఆ ఓట్ల చీలిక కొన్ని చోట్ల అయినా సమస్యలు సృష్టించే అవకాశం ఉంది.

యువ నాయకత్వమే లక్ష్యంగా వైసీపీ....



కర్నూలు, నవంబరు 23 .వైసీపీ లేట్ గా అయినా లేటెస్ట్ గా కీలక నిర్ణయం తీసుకోబోతోంది అని అంటున్నారు. ఇంకా చెప్పాలీ అంటే ఏపీలో టీడీపీ విజయవంతంగా అమలు చేస్తున్న విధానాన్ని వైసీపీ కూడా రానున్న కాలంలో అమలు చేసేందుకు రెడీ అవుతోంది. దాంతో వైసీపీలో ఇది అతి పెద్ద చర్చగానే కాదు భారీ ప్రక్షాళనకు నాందీ ప్రస్థానం గా ఉంటుంది అని అంటున్నారు. ఎందుకంటే వైసీపీలో అత్యధికులను ప్రభావితం చేసే సంచలన నిర్ణయంగా ఇది ఉండబోతోంది అని అంటున్నారు. భారతదేశంలో రాజకీయ పరంగా చూస్తే జగన్ యువ నేతగానే పరిగణిస్తారు. నిజానికి వైసీపీని ఏర్పాటు చేసినపుడు జగన్ 35 ఏళ్ళ యువకుడు. అలా యువ నాయకత్వంలో ఒక కొత్త పార్టీ ఏపీలో ఏర్పాటు అవుతుందని ఆనాడు అంతా అనుకున్నారు. తీరా చూస్తే అందులో అంతా సీనియర్లకే పెద్ద పీట వేస్తూ వచ్చారు. అప్పటికే యాభైలు దాటిన వారు అంతా కాంగ్రెస్ నుంచి వైసీపీలో చేరి జిల్లాల స్థాయిలో రాజకీయంగా కుదురుకున్నారు. తమ మాటే వేదం అన్నట్లుగా వారు జిల్లాలను శాసిస్తూ వచ్చారు. గత మూడు ఎన్నికల్లో కూడా వైసీపీ వారికే టికెట్లు ఇస్తూ వచ్చింది. వైసీపీ సామాజిక సమీకరణలు రాజకీయ వ్యూహాలు బాగానే ఉన్నా పార్టీలో యువ నాయకత్వాన్ని ప్రోత్సహించడంలో మాత్రం విఫలం అయింది అన్నది అయితే ఎపుడూ ఒక చర్చగా ఉంది. ఇక తెలుగుదేశం పార్టీ చూస్తే నాలుగున్నర దశాబ్దాలు చూసిన పార్టీ. ఒక విధంగా చెప్పాలంటే టీడీపీలోనే ఎక్కువ సీనియర్ నేతలు ఉన్నారు. వైసీపీ కోరి ఆ భారాన్ని తగిలించుకుంటే టీడీపీ నెమ్మదిగా వదిలించుకుంటూ వస్తోంది. ఆ పార్టీ 2024 ఎన్నికల నుంచి ఈ ప్రయోగాన్ని అమలు చేస్తూ వస్తోంది. దాంతో టీడీపీ ఎమ్మెల్యేలలో సగానికి సగం మంది యువతే కనిపిస్తున్నారు. అలాగే మంత్రులలో కూడా యంగ్ బ్యాచ్ ఎక్కువగా ఉంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో సైతం ఏరి కోరి యువతకే టీడీపీ పట్టం కట్టింది. అది మంచి ఫలితాలను ఇచ్చింది. వైసీపీ విషయానికి వస్తే ఈ విషయంలో పూర్తిగా వెనుకబడి ఉందని అంటున్నారు. దాంతో వైసీపీ ఇపుడు రూట్ మార్చి అయినా కొత్త తరానికి యువతకు చాన్స్ ఇవ్వాలని చూస్తోంది. ఈ మధ్య కాలంలో జగన్ నోట పదే పదే జెన్ జీ అన్న మాట వస్తోంది. జెన్ జీ తరాన్ని ఆకట్టుకోవాలంటే కచ్చితంగా యువతకే పెద్ద పీట వేయాల్సి ఉంటుందని అధినాయకత్వం ఆలోచనలు చేస్తోంది అని అంటున్నారు. దాని కోసం వైసీపీ భారీ ప్రక్షాళన దిశగా అడుగులు వేస్తోంది అని చెబుతున్నారు. సగానికి పైగా ఇంచార్జిల పనితీరు బాగు లేదని ప్రచారం సాగుతున్న నేపధ్యంలో ఇదే అదనుగా పార్టీలో యువ రక్తాన్ని కూడా ఎక్కించాలని అనుకుంటున్నట్లుగా చెబుతున్నారు వైసీపీలో ఇక మీదట ఎంపీ ఎమ్మెల్యే టికెట్ ఇచ్చినపుడు ఏజ్ 50 లోపు ఉండేలా చర్యలు తీసుకుంటుందని ప్రచారం అయితే సాగుతోంది. ఇంకా గట్టిగా చెప్పాలీ అంటే పార్టీలో పాతిక నుంచి నలభై మధ్యలో ఉన్న వారికే నాయకత్వ పగ్గాలు అప్పగించాలని చూస్తోంది అని అంటున్నారు. అదే కనుక జరిగితే వైసీపీలో అత్యధికులు గా ఉన్న సీనియర్లకు గండం తప్పదని అంటున్నారు. అయితే చాలా మంది ఇప్పటికే దీని మీద ఆలోచిస్తున్నారని తాము కనుక కాకపోతే తమ వారసులను బరిలోకి దింపి 2029 లో పోటీకి ఉంచాలని ప్లాన్స్ చేస్తున్నారు అని అంటున్నారు. మరి వారసులకే టికెట్లు ఇచ్చుకుంటూ పోతే కనుక వైసీపీ అనుకుంటున్న కొత్త నెత్తురు, ఫ్రెష్ లుక్ వస్తుందా అన్నది కూడా చర్చగా ఉంది. అయితే సమర్ధులైన వారసులకు ప్రాధాన్య త ఇస్తూనే ఎక్కువగా కొత్త వారికి ప్రోత్సాహం అందిస్తేనే పార్టీకి సుదీర్ఘ కాలంలో ప్రయోజనం ఉంటుందని ఫ్యాన్ పార్టీలో చర్చ అయితే సాగుతోంది అంటున్నారు.

మనమిత్ర యాప్ మొరాయింపు..

శ్రీశైల దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం అందుబాటులోకి తీసుకొచ్చిన మనమిత్ర యాప్ సక్రమంగా పనిచేయకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా శని, ఆదివారం, సోమవారం రోజుల్లో భక్తుల రద్దీ అధికంగా ఉండి, రోజుకు సుమారు 20 వేల నుంచి 30 వేల మంది భక్తులు వస్తున్నప్పటికీ ఆన్‌లైన్ సేవలు అందుబాటులో ఉండటం లేదని భక్తులు

పెనం మీద నుంచి పొయ్యిలోకి నిజామాబాద్ జిల్లా బీఆర్ఎస్!

నిజామాబాద్ : ఒకప్పుడు నిజామాబాద్ ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్‌కు కంచుకోట. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా రివర్స్‌గా మారింది. నేతల తీరుతో ..ఆ పార్టీ ప్రజలకు దూరమైంది. అగ్రనాయకత్వానికి తలవంపులు తెచ్చేలా ఉన్న నేతల తీరుతో అక్కడ మళ్లీ బీఆర్ఎస్ గెలవడం గగనమే అని అనుకుంటున్న తరుణంలో మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి.. మంత్రి సీతక్కపై చేసిన అనుచిత వ్యాఖ్యలు .. ఉన్న ఒక్క సీటు కూడా గెలిచే అవకాశం లేకుండా చేసుకుంటుందంటున్నారు.మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి కేసీఆర్‌కు సన్నిహితుడిగా ఉంటారని చెప్పుకుంటారు. ఫామ్ హౌజ్‌లో ఉండే అది కొద్ది మంది నేతల్లో , నమ్మిన బంటుగా ఉన్నవారిలో ప్రశాంత్‌రెడ్డి ఒకడు. అందుకే ఆయనకు తొలిసారి బీఆరెస్ సర్కార్ రాగానే కీలకమైన మిషన్ భగీరథ వైస్ చైర్మన్ పదవిని ఇచ్చాడు కేసీఆర్. ఆ తరువాత మంత్రిని చేశాడు. ఇది కేటీఆర్‌కు సుతారమూ ఇష్టం లేదనే ప్రచారం జరిగింది అప్పట్లో.సిట్టింగులకే మళ్లీ మళ్లీ టికెట్లిచ్చిన కేసీఆర్ తీరుతో అంతటా ఎలా డ్యామేజీ జరిగిందో.. ఉమ్మడి నిజామాబాద్‌లో కూడా అదే రిపీట్ అయ్యింది. ఇక్కడ సిట్టింగుల అరాచకాలు, అవినీతిపై ప్రజల్లో విసుగు పుట్టిందనే ప్రచారం జరిగింది. అయినా ముచ్చటగా మూడోసారీ వారికే కేసీఆర్ టికెట్ ఇవ్వడంతో జనం ఛీదరించుకున్నారు. తిప్పికొట్టారు.దీంతో ఒకప్పుడు ఘనమైన రాజకీయ చరిత్రను నమోదు చేసుకున్న బీఆర్ఎస్ పార్టీ ఇప్పుడు నేతలపై ఉన్న వ్యతిరేకత కారణంగా ప్రజలకు దూరమైంది. ఆ ఓడిన మాజీలు కూడా జనాల్లో కలిసి తిరగడం బంద్ చేశారు. మళ్లీ ఈసారి టికెట్ ఇవ్వరనే అనుమానాలు వారిని వెంటాడుతున్నాయంటున్నారు. ఇదిలా ఉంటే, తాజాగా ఇంచార్జి మంత్రిగా ఉన్న సీతక్కపై మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి నోరు పారేసుకున్నాడు.పింఛన్ల మంజూరులో చేసే రాజకీయ ఆరోపణలకు సహజంగానే తనకున్న నోటి దురుసును బాహాటంగానే ప్రదర్శించి సిగ్గుందా? అని ఆమెపై పరుషపదజాలాన్ని వాడాడు. దీంతో ఆమె అగ్గిమీద గుగ్గిలమయ్యారు. నిజామాబాద్ పర్యటన సందర్భంగా ఆమె ప్రశాంత్‌రెడ్డి తీరుపై విరుచుకుపడ్డారు. ఇదేనా కేసీఆర్ నీకు నేర్పిన సంస్కృతి? అంటూ తీవ్ర స్థాయిలో విమర్శించారు.మహిళలను కించపరిచేలా మాట్లాడే వారిని ఉరికించి ఉరికించి కొట్టిన చరిత్ర తనదని వార్నింగ్ ఇవ్వడం జిల్లా రాజకీయాల్లో కలకలం రేపింది. మహిళా మంత్రిని అవమానించారనే వార్త రాష్ట్ర వ్యాప్తంగా దావనంలా వ్యాపించడంతో అందరి దృష్టి నిజామాబాద్ జిల్లా రాజకీయాలపై పడింది. తన సామాజికవర్గాన్ని కూడా అతను అవమానపరిచేలా ఆ కామెంట్స్ ఉన్నాయని, మహిళలపై కనీస మర్యాద లేని ప్రశాంత్‌రెడ్డికి మంత్రి పదవి ఎలా ఇచ్చారని నిలదీసిన సీతక్క.. సొంత బిడ్డనే ఇంటి నుంచి గెంటేసిన చరిత్ర బీఆర్ఎస్‌ది.. కేసీఆర్‌కు అత్యంత సన్నిహితుడిగా ఉన్న ప్రశాంత్‌రెడ్డి నుంచి ఇంతకు మించిన సంస్కారం ఆశించడం వృథా అని ఆమె ధ్వజమెత్తారు.జిల్లా రాజకీయాల్లో ఇప్పుడిది హాట్ టాపిక్‌గా మారింది. మొన్నటి ఎన్నికల్లో బాల్కొండ నుంచి ప్రశాంత్‌రెడ్డి.. చావుదప్పి కన్నులొట్టబోయిన చందంగా గెలిచారు. విపరీతమైన ఖర్చు పెడితే తప్ప గెలుపు సాధ్యం కాలేదనే ప్రచారం ఉంది. ఆ జిల్లాకు చెందిన మరో నాలుగు... ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్, బోధన్, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాల్లో సిట్టింగులు ఘోరంగా ఓడిపోయారు. ఇప్పుడు బాల్కొండ పరిస్థితి గెలిచి బట్టకట్టే పరిస్థితి లేదంటున్నారు తాజా పరిస్థితుల నేపథ్యంలో.నేతల తీరుతోఆ పార్టీ పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలోకి పడినట్టైందని కామెంట్స్ చేస్తున్నారు అక్కడి జనం.



రాహుల్ కాన్ఫిడెన్స్ వేరే లెవెల్ ... సర్వేలకు అందనిది !



న్యూఢిల్లీ,కాంగ్రెస్ అగ్ర నేత లోక్ సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ రాజకీయ దూకుడు మామూలుగా అయితే లేదు. ఆయన గత రెండేళ్ళుగా యమ జోరు చేస్తున్నారు. కేంద్రంలో ఎన్డీయే సర్కార్ విధానాలను ఎండగడుతున్నారు. ప్రధాని నరేంద్ర మోడీని సైతం డిబేట్లకు తనతో రావాలని సవాల్ చేస్తున్నారు. అమిత్ షా తో పాటు ఆర్ఎస్ఎస్ ని కూడా కలిపి మరీ తీవ్ర స్థాయిలో విమర్శిస్తున్నారు. ఇంతకీ రాహుల్ లో పెరిగిన ఈ కాన్ఫిడెన్స్ కి కారణాలు ఏమిటి, ప్రజలలో ఆదరణ పెరిగిందని నివేదికలు చూసి ఇలా స్పీడ్ పెంచుతున్నారా లేక బీజేపీ కళ్ళల్లోకి చూసి మరీ తనకు ఎదురు లేదని భావిస్తున్నారా అన్నది అయితే చర్చనీయాంశంగా ఉంది.

విజయాలు లేవు కానీ :

ఇక చూస్తే 2024 లోక్ సభ ఎన్నికల తరువాత ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరిగినా బీజేపీ దాని మిత్ర పక్షాలే గెలుస్తూ వచ్చాయి. కాంగ్రెస్ ని అపజయాలే పలకరించాయి. ఎంతో ప్రతిష్టగా తీసుకున్న కీలక రాష్ట్రాలలోనూ అదే పరిస్థితి. అయితే 2026 లో మాత్రం కొంత ఊరట కలిగింది. దక్షిణ భారత దేశంలో కేరళ కాంగ్రెస్ సొంతం అయింది. అలాగే తమిళనాడు ప్రభుత్వంలో టీవీకేతో భాగస్వామ్యం దక్కింది. అయితే ఈ రెండూ బీజేపీ ఖాతాలో లేవు. మరి బీజేపీ నుంచి గెలుచుకున్న రాష్ట్రం ఒక్కటి ఉంటే కాంగ్రెస్ గ్రాఫ్ పెరిగినట్లుగా భావించాలి. వచ్చే ఏడాది జరిగే ఎన్నికల్లో అది జరుగుతుందో లేదో చూడాలి కానీ రాహుల్ తీరు చూస్తే అపుడే 2029 ఎన్నికల్లో గెలిచేసినంతగా హడావుడి చేస్తున్నారు. పూర్తి ధీమా ప్రదర్శిస్తున్నారు. మరి ఎందుకిలా అంటే అక్కడే రాజకీయ తమాషా ఉంది అంటున్నారు.

ఏ సర్వేలు చెప్పనివి :

రాజకీయాల్లో సర్వేలు అన్నవి సాంకేతికంగా కొంత వరకూ జనాభిప్రాయాన్ని కొలిచి పెట్టగలవేమో. కానీ రాజకీయం అన్నది నిరంతర స్రవంతి. అలా కనుక చూస్తే డే టూ డే పరిణామాలు ఎన్నో జరుగుతూ ఉంటాయి. అన్నింటినీ బేరీజు వేసుకుంటూ రాజకీయ పార్టీలు అయినా నేతలు అయినా ముందుకు సాగుతూ ఉంటారు. అలా వారికి వచ్చే నివేదికలు అంతర్గతంగా ఎన్నో ఉంటాయి. అవన్నీ ఒక ఎత్తు అయితే ప్రత్యర్ధి బలం ఎక్కడ చూడాలి అంటే అతని మాటలలో పోకడలలో అన్నది రాజకీయాల్లో అసలైన మూల సూత్రం. ప్రత్యర్ధిలో ధీమా సడలినపుడు అదే పనిగా విమర్శలు చేస్తారు. అంతే కాదు ఫుల్ ఫోకస్ ఇటు వైపే పెడతారు. అలాంటివి చూసినపుడు సహజంగానే అవతల పక్షం తమకు బలం కచ్చితంగా ఉందని భావనకు రావచ్చు.ఇపుడు జాతీయ స్థాయిలో అదే జరుగుతోంది అని అంటున్నారు. రాహుల్ గాంధీ మాట్లాడితే చాలు బీజేపీలో అనేక మంది నాయకులు కౌంటర్ ఇస్తున్నారు. ఇక ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా కానీ మోడీ అమిత్ షాలు రెస్పాండ్ అవుతున్నారు. ఇవన్నీ రాహుల్ గ్రాఫ్ పెరిగింది అనడానికి సంకేతాలు కదా అన్నదే కాంగ్రెస్ మార్కు విశ్లేషణగా ఉంది. అవును ఊరకే ప్రత్యర్థుల మీద ఎవరూ ఫోకస్ పెట్టరు, వారికి బలం ఉందని తెలిస్తేనే వారిని టార్గెట్ చేస్తారు. అలా చూస్తే కనుక రాహుల్ కి తన బలం ఏమిటో బీజేపీ నేతల కళ్లలో చూస్తేనే కనిపిస్తోంది అని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు. మరి రాహుల్ కాన్ఫిడెన్స్ అయితే వేరే లెవెల్ అన్నది అంతా ఇపుడు అంటున్న మాట. మరి అది కాంగ్రెస్ గ్రాఫ్ ని ఎంతగా పెంచుతుంది అన్నది వచ్చే ఏడాది జరిగే ఎన్నికలు నిరూపిస్తాయని అంటున్నారు.

Edited, Printed, Published & owned by KOTAGIRI CHANDRA SHEKAR, Published From, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001, Printed at KOTAGIRI GRAPHICS & KOTAGIRI OFFSET PRINTER, H.NO.5-7-163 PR